

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | సోమవారం | 21-09-2026 | సంపుటి: 3 | సంచిక: 228 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 21-09-2026 | V0LUME : 3 | ISSUE : 228 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




# కేసీఆర్ రంగంలోకి దిగాల్సిందేనా?

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టూ మూడో రోజు కొనసాగిన భూసర్వే

- సర్వే నంబర్ 325లో 388 ఎకరాల హద్దుల నిర్ధారణ
- 120 మందికి పైగా రైతులకు నోటీసులు.. ఈ నెల 21న ఆధారాలతో హాజరుకావాలని ఆదేశం
- ఫామ్‌హౌస్ భూములపై సమగ్ర సర్వే, రికార్డుల పరిశీలనకు అధికారుల కసరత్తు
- అసెంబ్లీ వివాదాల నుంచి 22ఏ భూముల వరకు మారుతున్న బీఆర్ఎస్ రాజకీయ అజెండా
- స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఎర్రవల్లి భూముల అంశం కీలకంగా మారే అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 20:**

తెలంగాణ రాజకీయాల్లో ఎర్రవల్లి భూముల వ్యవహారం ఇప్పుడు మరో కీలక మలుపు తిరిగింది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో రెవెన్యూ, సర్వే అధికారులు వరుసగా మూడు రోజులపాటు భూసర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూముల హద్దులను డిజిటల్ పద్ధతిలో గుర్తించడంతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో 120 మందికి పైగా రైతులకు అధికారులు నోటీసులు జారీ చేయడం రాజకీయంగా మరింత ఆసక్తి రేపుతోంది.

**ఎర్రవల్లిలో ముమ్మర సర్వే**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, వరదరాజ్‌పూర్, వెంకటాపూర్ పరిధిలోని భూములపై అధికారులు ఈ నెల 17 నుంచి సర్వే ప్రారంభించారు. రెండో రోజు సుమారు 30 మంది అధికారులు, సిబ్బందితో సర్వే నిర్వహించగా.. పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ అధికారులు సర్వే కొనసాగించారు. మూడో రోజు కూడా ప్రత్యేక బృందాలు సర్వేను కొనసాగించాయి. సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల హద్దులను శాటిలైట్, డిజిటల్ సర్వే పద్ధతుల్లో నిర్ధారించారు. మరోవైపు మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో పాత రికార్డులు, రెవెన్యూ ఫైళ్లను పరిశీలించారు. క్షేత్రస్థాయి సర్వే, పాత రికార్డులను సరిపోల్చిన తర్వాత తదుపరి చర్యలపై అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

మిగతా 2వ పేజీలో..

## రాజకీయం అంటే బూతులు తిట్టుకోవడమేనా?



2

- కొస్గి పాంచజన్య సంకల్ప సభలో కల్వకుంట్ల కవిత ఘాటు వ్యాఖ్యలు
- రాష్ట్రంలో అరాచకాలు పెరిగాయని విమర్శ
- రైతులకు నీళ్లు, యూరియా, ధాన్యం అందడం లేదని ఆరోపణ
- అధికారంలోకి వస్తే ఉచిత వైద్యం.. విద్య, వైద్య రంగాలకు రూ.లక్ష కోట్లు

## రైతు రాజ్యం పోయి.. రాక్షస రాజ్యం వచ్చింది: హరీశ్‌రావు

- * కాంగ్రెస్ పాలనలో రైతులు కన్నీళ్లు పెడుతున్నారని మాజీ మంత్రి విమర్శ
- • మిల్లర్లు, దళారుల చేతిలో ప్రభుత్వం కీలుబొమ్మగా మారిందని ఆరోపణ
- • విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయంటూ మంత్రి కోమటిరెడ్డికి సవాల్

2



## డెడ్ డ్రాప్‌తో డ్రగ్స్ దందా

- హైదరాబాద్ వరకు నెట్‌వర్క్
- * అవినాష్ అరెస్టుతో బయటపడిన అంతర్రాష్ట్ర డ్రగ్స్ సరఫరా ముఠా
- • ఒడిశా కోరాపుట్ నుంచి పాచిపెంట మీదుగా

3



## కేటీఆర్ నోరు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి

కోమటిరెడ్డి



2

- దేవరకద్రలో అభివృద్ధి పనులకు మంత్రులు కోమటిరెడ్డి, వాకిటి శ్రీహరి శ్రీకారం
- అక్రమంగా కొల్లగొట్టిన ప్రభుత్వ భూములను రికవరీ చేస్తామని వెల్లడి
- ఫామ్‌హౌస్‌లు, డ్రగ్స్ వ్యవహారంపై బీఆర్ఎస్‌పై మంత్రి తీవ్ర ఆరోపణలు
- కేసీఆర్ హయాంలో 13 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని విమర్శ

## దానం నాగేందర్‌కు మళ్లీ ఓటమి తప్పదు

రఘునందన్‌రావు



2

- ఖైరతాబాద్ ఉప ఎన్నికపై బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు కీలక వ్యాఖ్యలు
- పార్టీలు మారడం దానం నాగేందర్‌కు అలవాటుగా మారిందని విమర్శ

## వైష్ణవి హత్యకు ప్రతీకారంగానే హరిబాబు హత్య




- నిందితుడు సంతోష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- తల్లి, బంధువుల సహకారంతో హత్యకు పథకం వేసినట్లు వెల్లడి
- రెండు కత్తులు, రెండు కర్రలు, కారు స్వాధీనం
- హత్య అనంతరం ఏపీకి పారిపోయేందుకు యత్నించిన సంతోష్
- కేసులో మరో నలుగురి పాత్రపై కొనసాగుతున్న దర్యాప్తు

2



## ఖైరతాబాద్ బడా గణేశుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

- సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే భారీగా రాక
- ఇప్పటివరకు 50 వేల మందికి పైగా దర్శనం
- పూర్తిగా నిండిపోయిన నాలుగు క్యూలైన్లు
- రద్దీ నియంత్రణకు రంగంలోకి దిగిన రోప్ పార్టీలు
- సాయంత్రానికి మరింత పెరిగే అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 20:**

ఖైరతాబాద్ బడా గణేశుడి దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. సెలవు రోజు కావడంతో నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఖైరతాబాద్ పరిసరాలు కిటకిటలాడాయి. గణనాథుడిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు.

మిగతా 2వ పేజీలో..

## ఉద్యోగాల పేరిట నందుస్ వరల్డ్ మోసం



- • తెలంగాణలోనూ బాధితులు.. ప్రజావాణిలో గద్వాల విజయలక్ష్మికి ఫిర్యాదు • యూకే ఉద్యోగాలు, వీసాల పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేశారని ఆరోపణ
- * హైదరాబాద్, వరంగల్, సికింద్రాబాద్, సిద్దిపేట, సూరత్ నుంచి వచ్చిన బాధితులు

3



3

## ఇందిరమ్మ ఎల్ఐజీ ఫ్లాట్లకు అలాట్‌మెంట్ లెటర్లు

- రేపటి నుంచి లబ్ధిదారులకు వాట్సాప్ ద్వారా లెటర్ల జారీ
- హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్‌లోనూ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం
- లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక వెసులుబాటు
- రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్‌కు రేపు శంకుస్థాపన
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమం

## దళితుల అంగుళం భూమినీ ప్రభుత్వం తీసుకోదు

- భూ రికార్డుల పరిశీలనను భూములు లాక్కునే చర్యగా చూడొద్దు:
- పొంగులేటి
- దళిత, గిరిజనుల భూ హక్కులకు ప్రజా ప్రభుత్వం సంపూర్ణ రక్షణ
- భూ సమస్యల పరిష్కారం, హక్కుల నమోదు కోసమే రీ-సర్వేలు
- దళితులను భయపెట్టే విషప్రచారాన్ని నమ్మొద్దని మంత్రి సూచన

3



రాజముద్ర
తెలుగు దిన పత్రిక

# ఖైరతాబాద్ బడా గణేశుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

**50 వేల మందికి పైగా దర్శనం**

ఉదయం నుంచే భక్తుల రాక పెరగడంతో నాలుగు క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. ఇప్పటివరకు 50 వేల మందికి పైగా భక్తులు బడా గణపతిని దర్శించుకున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. రద్దీ కారణంగా దర్శనానికి కొంత సమయం పడుతున్నప్పటికీ భక్తులు ఓపికగా క్యూలైన్లలో ముందుకు సాగుతున్నారు.

**భద్రతపై పోలీసుల ప్రత్యేక దృష్టి**

వీకెండ్ రద్దీని దృష్టిలో పెట్టుకుని పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా, తొక్కిసలాటకు అవకాశం లేకుండా రోప్ పార్టీలను ఏర్పాటు చేశారు. భక్తులను క్రమపద్ధతిలో ముందుకు పంపిస్తూ రద్దీని నియంత్రిస్తున్నారు. సాయంత్రం వేళ భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో పోలీసులు అదనపు బలగాలను మోహరించారు. పరిసర ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతా చర్యలు చేపడుతున్నారు.

# వైష్ణవి హత్యకు ప్రతీకారంగానే హరిబాబు హత్య

**నిజామాబాద్, సెప్టెంబర్ 20:**

హరిబాబు హత్య కేసులో ప్రధాన నిందితుడు సంతోష్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వైష్ణవి హత్యకు ప్రతీకారంగానే హరిబాబును సంతోష్ హత్య చేసినట్లు నిజామాబాద్ సీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ నెల 17న నిజామాబాద్‌లోని ఆర్‌ఆర్ చౌరస్తా వద్ద హత్య జరిగినట్లు వెల్లడించారు.

**పక్కా పథకంతో హత్య**

హరిబాబు నిజామాబాద్‌లో ఉన్నాడని తెలుసుకున్న సంతోష్.. తల్లి, బంధువుల సహకారంతో హత్యకు పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. హత్యకు ఉపయోగించిన రెండు కత్తులు, రెండు కర్రలు, కారును స్వాధీనం చేసుకున్నామని సీపీ చెప్పారు. సంతోష్‌తో పాటు అతడి తల్లి గంధం రాణి, పెద్దమ్మ కుమారులు చరణ్, రంజిత్ నేరాన్ని ప్రోత్సహించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. కేసులో మరో నలుగురి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

**హత్య అనంతరం పరారయ్యేందుకు యత్నం**

హరిబాబును హత్య చేసిన అనంతరం సంతోష్ ఆంధ్రప్రదేశ్ వైపు పారిపోయేందుకు ప్రయత్నించినట్లు సీపీ వెల్లడించారు. అతడి కదలికలను గుర్తించిన పోలీసులు నిజామాబాద్ బైపాస్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నారని తెలిపారు.

**గతంలో భార్యను హత్య చేసిన హరిబాబు**

జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన హరిబాబు.. వైష్ణవిని ప్రేమవివాహం చేసుకున్నాడు. ఈ ఏడాది మార్చి 17న నాలుగు నెలల గర్భిణిగా ఉన్న వైష్ణవిని గొంతు నులిమి, కత్తితో దాడి చేసి హత్య చేసిన కేసులో హరిబాబు అరెస్టయ్యాడు. అనంతరం బెయిల్‌పై విడుదలయ్యాడు. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత ప్రాణభయంతో అనంతపురంలో గణేశ్ విగ్రహాల తయారీ కేంద్రంలో పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు హరిబాబు తల్లి లక్ష్మి నిజామాబాద్‌లోని ఇంద్రాపూర్ కాలనీలో అద్దెకు ఉంటూ రాజరాజేంద్ర చౌరస్తా వద్ద మొక్కజొన్నలు విక్రయిస్తోంది. తల్లిని చూసేందుకు నిజామాబాద్‌కు వచ్చిన హరిబాబు ఈ నెల 17న సాయంత్రం పానీపూరి బండి వద్ద నీళ్లు తాగుతుండగా సంతోష్ కారులో అక్కడికి వచ్చాడు. అనంతరం కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో హరిబాబు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

**ఆరు నెలల తర్వాత ప్రతీకారం**

మార్చి 17న వైష్ణవి భర్త హరిబాబు చేతిలో హత్యకు గురికాగా.. సరిగ్గా ఆరు నెలల తర్వాత సెప్టెంబర్ 17న వైష్ణవి సోదరుడు సంతోష్ చేతిలో హరిబాబు హత్యకు గురయ్యాడు. వరుసగా చోటుచేసుకున్న ఈ రెండు హత్యలు నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. కేసులో మిగిలిన నిందితుల పాత్రపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఉద్యోగాల పేరిట నందుస్ వరల్డ్ మోసం

- ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే ఎఫ్ఐఆర్.. పలు రాష్ట్రాల్లో మోసం జరిగినట్లు ఫిర్యాదు
- ఆర్థిక నేరాల విభాగంతో సమగ్ర దర్యాప్తు చేయించాలని బాధితుల విజ్ఞప్తి
- నిందితుల బ్యాంకు ఖాతాలు స్తంభింపజేసి డబ్బులు తిరిగి ఇప్పించాలని డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 20:**

యూకేలో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేశారనే ఆరోపణలపై తెలంగాణకు చెందిన పలువురు బాధితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నందుస్ వరల్డ్ యూకే సంస్థ పేరుతో జరిగినట్లు చెబుతున్న ఈ వ్యవహారంలో తాము కోట్ల రూపాయలు నష్టపోయామని బాధితులు తెలంగాణ ప్లానింగ్ కమిషన్ బోర్డు వైస్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు.

**ఉద్యోగాలు, వీసాల పేరుతో వసూళ్లు**

హైదరాబాద్, వరంగల్, సికింద్రాబాద్, గుంటూరు, సిద్దిపేట, సూరత్ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ ఫిర్యాదులో మధుకర్ జగలముడి, రమానందన అన్నే, మోహన్ రావు జగర్లముడి పేర్లను పేర్కొన్నారు. యూకేలో ఉద్యోగం, వీసా ఇప్పిస్తామని నమ్మించి తమ నుంచి డబ్బులు తీసుకున్నారని, ఆ తర్వాత ఉద్యోగం లేదా వీసా ఇవ్వలేదని ఆరోపించారు. చెల్లించిన మొత్తాలను కూడా తిరిగి ఇవ్వలేదని తెలిపారు.

**ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే కేసు**

బాధితుల్లో బ్రిజేష్ కుమార్, రమేష్‌భాయ్ జివాని నిందితులపై ఆంధ్రప్రదేశ్‌లోని అద్దంకి పోలీస్ స్టేషన్‌లో జూలై 4న ఎఫ్ఐఆర్ నంబర్ 141/2026 నమోదు చేసినట్లు తెలిపారు. దీంతో ఈ వ్యవహారం ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా పలు రాష్ట్రాల్లోనూ బాధితులు ఉన్నట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

బాధితుల విజ్ఞప్తి మేరకు గద్వాల విజయలక్ష్మి వారి సమస్యలను విని, నిందితులపై చర్యలకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బాధితుల తరఫున అడ్వకేట్ రామ్ కళ్యాణ్ చల్లా సీఎం ప్రవాసీ ప్రజావాణికి ఫిర్యాదు సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ డీజీపీకి కూడా ఫిర్యాదు అందజేసేందుకు సహకరించినట్లు తెలిపారు. కేసును ఆర్థిక నేరాల విభాగానికి అప్పగించి సమగ్రంగా దర్యాప్తు చేయాలని, నిందితుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసి తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని బాధితులు కోరారు. ఎన్ఆర్ఐ సలహా కమిటీ నోడల్ అధికారి కె. విద్యాసాగర్, కమిటీ చైర్మన్ అంబాసిడర్ డా. వినోద్ కుమార్ మార్గదర్శకత్వంలో వాలంటీర్లు గంగుల మురళీధర్‌రెడ్డి, భార్గవి బాధితులకు సహకరించారు. మరెవరూ ఇలాంటి మోసాలకు గురికాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

# కేసీఆర్ రంగంలోకి దిగాల్సిందేనా?

**మొదటిపేజీ తరువాయి**

**రైతులకు నోటీసులు**

సర్వే పూర్తయిన నేపథ్యంలో సర్వే నంబర్ 325 పరిధిలో భూములు కలిగి ఉన్న రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. 120 మందికి పైగా రైతులను ఈ నెల 21న తమ వద్ద ఉన్న భూ యాజమాన్య పత్రాలతో హాజరుకావాలని ఆదేశించినట్టు సమాచారం. ఈ భూములు దశాబ్దాల క్రితం పేద దళితులకు అసైన్డ్ భూములుగా కేటాయించినవని అధికారులు చెబుతున్నారు. అయితే తమకు దశాబ్దాలుగా ఈ భూములపై సాగు హక్కు ఉందని రైతులు చెబుతున్నారు. సమీపంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొందరు రైతులు కూడా సర్వే నంబర్‌లోని భూముల్లో తమకు వాటా ఉందని పేర్కొంటున్నారు. పాత రికార్డుల ఆధారంగా హద్దులను నిర్ణయించాలని వారు కోరుతున్నారు.

**ఫామ్‌హౌస్‌పై తదుపరి దశ ఏంటి?**

కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిధిలోని భూముల అసలు విస్తీర్ణం, యాజమాన్య హక్కులు, ప్రభుత్వ భూముల పరిస్థితిని సర్వే, రికార్డుల పరిశీలన ద్వారా నిర్ధారిస్తామని ప్రభుత్వం చెబుతోంది. భూమి చట్టబద్ధంగా రిజిస్టర్ అయి ఉంటే ఇబ్బంది లేదని, తేడాలు లేదా అదనపు భూమి ఉన్నట్టు తేలితే నోటీసులు జారీ చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు ప్రభుత్వం చెప్పిన ఆరోపణలకు బీఆర్ఎస్ నేతలు ఖండనలు, వివరణలు ఇస్తున్నారు. దీంతో ఎర్రవల్లి భూముల అంశం కేవలం రెవెన్యూ వ్యవహారంగా కాకుండా తెలంగాణ రాజకీయాల్లోనూ ప్రధాన చర్చగా మారింది.

**బీఆర్ఎస్ డిఫెన్స్‌లోకి?**

అసెంబ్లీ గేటు వద్ద వివాదం, 22ఏ భూముల అంశం, ఇప్పుడు ఎర్రవల్లి భూముల సర్వే.. ఇలా వరుసగా కొత్త అంశాలు రాజకీయ చర్చను ఆక్రమిస్తున్నాయి. ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీయాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్న సమయంలోనే అధికార పక్షం భూముల అంశాన్ని ముందుకు తీసుకురావడం ఆ పార్టీకి కొత్త రాజకీయ సవాలుగా మారిందన్న చర్చ సాగుతోంది. కేటీఆర్, హరీశ్‌రావులు ప్రభుత్వ ఆరోపణలపై మీడియా సమావేశాల ద్వారా స్పందిస్తున్నప్పటికీ.. ఎర్రవల్లి వ్యవహారం క్షేత్రస్థాయికి వెళ్లడంతో బీఆర్ఎస్ కూడా రాజకీయంగా మరింత ప్రత్యక్ష కార్యాచరణకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**కేసీఆర్ ఎంట్రీపై చర్చ**

ఇదే సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగాల్సిన అవసరం ఉందా? అన్న చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. ముఖ్యంగా తన ఫామ్‌హౌస్ చుట్టూ జరుగుతున్న సర్వే, భూములపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు, రైతులకు నోటీసుల నేపథ్యంలో కేసీఆర్ స్పందన ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకు కేటీఆర్, హరీశ్‌రావులు ప్రభుత్వాన్ని రాజకీయంగా ఎదుర్కొంటున్నారు. కానీ ఎర్రవల్లి అంశం నేరుగా కేసీఆర్ కుటుంబం, ఆయన ఫామ్‌హౌస్ చుట్టూ తిరుగుతుండటంతో.. పార్టీ అధినేత స్వయంగా ప్రజల్లోకి వచ్చి దీనిపై వివరణ ఇస్తారా? అన్న ప్రశ్న బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**ఎన్నికల అజెండాగా మారుతుందా?**

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎర్రవల్లి భూముల వ్యవహారం రాజకీయ ప్రచారంలోనూ ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ అంశాన్ని భూ హక్కులు, అసైన్డ్ భూముల పరిరక్షణ కోణంలో ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉండగా.. బీఆర్ఎస్ మాత్రం తమపై జరుగుతున్న రాజకీయ కక్ష సాధింపు చర్యలుగా ఆరోపించే అవకాశం ఉంది. ప్రస్తుతం సర్వే, రికార్డుల పరిశీలన పూర్తయి అధికారికంగా తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది. అప్పటివరకు భూములపై ఎవరి హక్కు ఎంత? ప్రభుత్వ భూమి ఎంత? అన్నది స్పష్టంగా తేలాల్సి ఉంది. అయితే మూడు రోజుల సర్వే, రైతులకు నోటీసులు, తదుపరి విచారణ నేపథ్యంలో ఎర్రవల్లి వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మాత్రం మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

# రాజకీయం అంటే బూతులు తిట్టుకోవడమేనా?

- పాలమూరులో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ
- తెలంగాణ రక్షణ సేనను ఆశీర్వదించాలని ప్రజలకు పిలుపు

**నారాయణపేట, సెప్టెంబర్ 20:**

తెలంగాణలో రాజకీయాలు బూతులు తిట్టుకోవడం వరకే పరిమితమయ్యాయా? అని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. నారాయణపేట జిల్లా కోస్గిలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. సమాజంలో అధర్మం పెరిగి, పాలకుల చర్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పుడు ధర్మపోరాటానికి సిద్ధం కావాలన్న సందేశంతోనే పాంచజన్య సభ నిర్వహిస్తున్నామని చెప్పారు.

**ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎదురుదాడి**

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు ఎదురుదాడికి దిగుతున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోయాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందని ఆమె అన్నారు.

**రైతుల గోసపై ఆగ్రహం**

రైతులకు సాగునీరు అందించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని కవిత ఆరోపించారు. నీళ్లు, యూరియా, ధాన్యం కోసం రైతులు అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పాలమూరు రైతులు జూరాల హెడ్ రెగ్యులేటర్‌ను పగులగొట్టి నీటిని విడుదల చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు లేక రైతులు తమ పంటలను కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో మళ్లీ రైతుల ఆత్మహత్యలు పెరిగే పరిస్థితి రావాలా? అని ప్రశ్నించారు.

**విద్య, వైద్యానికి రూ.లక్ష కోట్లు**

తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ప్రజలకు పూర్తిగా ఉచిత వైద్యం అందిస్తామని కవిత హామీ ఇచ్చారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అవసరమైతే రూ.లక్ష కోట్లు ఖర్చు చేసేందుకు వెనుకాడబోమని చెప్పారు. పాలమూరు ప్రాంతంలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు.

**బహుజనుల బాణం**

తన రాజకీయ ప్రయాణంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై కవిత స్పందించారు. తాను కాంగ్రెస్ విడిచిన బాణమని బీఆర్ఎస్ నేతలు, కల్వకుంట్ల కుటుంబం అవినీతి కారణంగా బీఆర్ఎస్‌ను వీడిన బాణమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. తాను ఎవరి బాణాన్ని కాదని.. తెలంగాణ బహుజనుల బాణాన్ని అని స్పష్టం చేశారు. సభలో ప్రజా గాయకుడు గద్దర్ పాడిన 'భలేగుందిరో మన అసెంబ్లీ' పాటలోని చరణాలను కవిత ఆలపించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. బాధ్యత లేని నాయకులు ఉన్నప్పుడు యువత రాజకీయాల్లోకి వచ్చి బలమైన నాయకత్వాన్ని అందించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రక్షణ సేనను ప్రజలు ఆదరించి ఆశీర్వదిస్తే రాష్ట్రంలోని సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని కవిత అన్నారు.

# రైతు రాజ్యం పోయి.. రాక్షస రాజ్యం వచ్చింది: హరీశ్‌రావు

- భూకబ్జాలు, కమీషన్లపై సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు
- ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని స్పష్టం
- కేసీఆర్ కంటే మెరుగైన పాలన చేసి చూపాలని కాంగ్రెస్ నేతలకు సవాల్

**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 20:**

రాష్ట్రంలో కేసీఆర్ హయాంలో ఉన్న రైతు రాజ్యం పోయి.. ప్రస్తుతం రాక్షస రాజ్యం వచ్చిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిల్లర్లు, దళారుల చేతిలో కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, పాలనా వైఫల్యాల కారణంగానే రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ప్రస్తుతం 'ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు.. తెలంగాణకు కన్నీళ్లు' అన్న పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు.

**విద్యుత్ కోతలపై సవాల్**

బొగ్గు కొరతను సాకుగా చూపి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తిని ప్రభుత్వం నిలిపివేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు పెరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. గతంలో ప్రతిపక్ష ఎంపీగా ఉన్నప్పుడు విద్యుత్ సబ్‌స్టేషన్లకు వెళ్లి లాగ్‌బుక్‌లు పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. ఇప్పుడు అధికారంలో ఉండి జరుగుతున్న విద్యుత్ కోతలపై అదే లాగ్‌బుక్‌లను పరిశీలించే ధైర్యం ఉందా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

**భూకబ్జాలు, కమీషన్లపై ఆరోపణలు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు రాష్ట్రంలో భూకబ్జాలకు పాల్పడుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ వ్యవహారాలను ప్రశ్నిస్తున్నందుకే బీఆర్ఎస్ నేతలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. భూముల క్లియరెన్స్ కోసం 30 శాతం, కాంట్రాక్టు బిల్లుల చెల్లింపులకు 15 శాతం కమీషన్లు అడుగుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీలు పొలాల్లో పర్యటించడం, ఫొటోలకు పోజులివ్వడం కాకుండా ఢిల్లీలో రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలని సూచించారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశకు నిధులు, కృష్ణా నదిలో తెలంగాణ వాటా వంటి అంశాలపై కేంద్రాన్ని నిలదీయాలని హితవు పలికారు.

**ఆరు గ్యారంటీలపై పోరాటం**

ఉద్యమాలు, పోరాటాలు, కేసులు, జైలు జీవితం తమకు కొత్తేమీ కాదని హరీశ్‌రావు అన్నారు. ఎన్ని బెదిరింపులు చేసినా తాము వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. కేసీఆర్ మరణాన్ని కోరుకోవడం మానుకోవాలని కాంగ్రెస్ నేతలకు సూచించిన హరీశ్‌రావు.. ఆయన కంటే గొప్పగా పనిచేసి

# దానం నాగేందర్‌కు మళ్లీ ఓటమి తప్పదు

- ఉప ఎన్నికలు ఆయనకు ఎప్పుడూ కలసిరాలేదన్న బీజేపీ ఎంపీ
- ఖైరతాబాద్‌లో బీజేపీ విజయం ఖాయమని ధీమా
- హైకోర్టు అనర్హత వేటుతో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానం
- దానం రాజకీయ ప్రస్థానంపై రఘునందన్‌రావు విమర్శలు



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దానం నాగేందర్ గతంలో టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లోకి, ఆ తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లారని రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకోవడం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు. గతంలోనూ దానం నాగేందర్ ఉప ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని, ఇప్పుడు ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక వస్తే మళ్లీ ఓటమి తప్పదని అన్నారు. బీజేపీ ఈ ఎన్నికలో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున దానం నాగేందర్ ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరి, ఆ పార్టీ బీఫామ్‌పై సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూ మరో పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయి ఉప ఎన్నికకు మార్గం ఏర్పడింది.

## కేటీఆర్ నోరు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి

- ఉప ఎన్నికలకు కాంగ్రెస్ భయపడదని కోమటిరెడ్డి స్పష్టం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 20:**

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి పర్యటించారు. పలు ప్రధాన రహదారులు, వంతెనల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

**ఫామ్‌హౌస్‌లు, డ్రగ్స్‌పై ఆరోపణలు**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నోరు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని కోమటిరెడ్డి హెచ్చరించారు. ప్రజల సొమ్మును దోచుకుని వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుంటే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. అసైన్డ్ భూములు, లావుణి పట్టా భూములతో పాటు 111 జీవో పరిధిలోని భూముల్లో డ్రగ్స్ దందా సాగిస్తే సహించేది లేదన్నారు. అక్రమంగా ఆక్రమించిన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. గతంలో ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ తీసుకుంటూ కేటీఆర్ బావమరిది పట్టుబడిన ఘటనను కూడా మంత్రి ప్రస్తావించారు.

**ఉప ఎన్నికలకు భయపడేది లేదు**

తాను ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా తనకు ఎలాంటి ఫామ్‌హౌస్ లేదని కోమటిరెడ్డి అన్నారు. గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో 13 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనుగోలు చేశారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నేతలు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఉప ఎన్నికలు వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.

# దళితుల అంగుళం భూమినీ ప్రభుత్వం తీసుకోదు

- సూర్యాపేట, మహబూబాబాద్‌లో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం
- భూమిపై హక్కులతో ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 20:**

దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. వారి అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం దళితుల భూ హక్కులకు రక్షణగా నిలుస్తుందని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

**భూ హక్కుల పరిరక్షణే లక్ష్యం**

భూ రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ సమస్యల పరిష్కార ప్రక్రియలను ప్రజల భూములను స్వాధీనం చేసుకునే చర్యలుగా చూడటం సరికాదని మంత్రి తెలిపారు. భూములపై హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, వివాదాలను పరిష్కరించడం, హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. దళితులు, గిరిజనుల భూముల విషయంలో కొందరు కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలను తెలుసుకోకుండా ఇలాంటి ప్రచారాలను నమ్మొద్దని సూచించారు. దళితులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు.

**రీ-సర్వేతో సమస్యలకు పరిష్కారం**

దశాబ్దాలుగా భూ హక్కులకు దూరంగా ఉన్న దళిత, గిరిజనులకు రీసర్వే ద్వారా హక్కులు కల్పిస్తున్నామని పొంగులేటి తెలిపారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రామాలతో పాటు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురంలో దీర్ఘకాలిక భూ సమస్యలకు పరిష్కారం చూపినట్లు చెప్పారు. భూమిపై హక్కులు కల్పించడం ద్వారా ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు భూ సంస్కరణలు, భూ పంపిణీ ద్వారా భూమిలేని దళితులకు హక్కులు కల్పించాయని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో

ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాలు, పోడు భూముల విషయంలో గిరిజనులకు సుమారు 2 లక్షల ఎకరాలపై హక్కులు కల్పించినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరఫున దళిత కుటుంబాలకు స్పష్టమైన హామీ ఇస్తున్నానని పొంగులేటి అన్నారు. "మీ అంగుళం భూమి కూడా ప్రభుత్వం లాక్కోదు. మీ భూమిని తీసుకునే ఆలోచన ప్రభుత్వానికి లేదు. ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రజా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని పేర్కొన్నారు.

# డెడ్ డ్రాప్‌తో డ్రగ్స్ దందా

- వాట్సాప్ ఆర్డర్లు.. ఫోన్‌పే చెల్లింపులు.. గూగుల్ మ్యాప్స్‌తో లొకేషన్లు
- 31 మంది క్యారియర్లు, సుమారు 230 మంది వినియోగదారులను గుర్తించిన పోలీసులు
- అర్ధరాత్రి ఆపరేషన్‌లో ఐదుగురు కీలక వ్యక్తుల అరెస్ట్
- 100 మందిని అదుపులోకి తీసుకోగా.. 80 మందికి డ్రగ్స్ వినియోగం నిర్ధారణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 20:**

డ్రగ్స్ విక్రయిస్తున్నాడనే సమాచారంతో 27 ఏళ్ల సత్య అవినాష్‌ను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు భారీ అంతర్‌రాష్ట్ర డ్రగ్స్ నెట్‌వర్క్‌ను ఛేదించారు. ఒడిశాలోని కోరాపుట్ నుంచి విజయనగరం జిల్లా పాచిపెంట మీదుగా హైదరాబాద్ వరకు ఈ నెట్‌వర్క్ విస్తరించినట్లు దర్యాప్తులో గుర్తించారు.

**టెక్నాలజీతో 'డెడ్ డ్రాప్' దందా**

ముఠా వాట్సాప్ ద్వారా డ్రగ్స్ ఆర్డర్లు తీసుకుని, ఫోన్‌పే ద్వారా డబ్బులు బదిలీ చేయించుకునేది. అనంతరం డ్రగ్స్‌ను ఒకచోట దాచి, ఆ ప్రదేశం లొకేషన్‌ను గూగుల్ మ్యాప్స్ ద్వారా కస్టమర్లకు పంపేది. నేరుగా కలుసుకోకుండా సరుకు అందించే ఈ విధానాన్ని 'డెడ్ డ్రాప్'గా పిలుస్తారు. జూన్, జూలై 2026లో మానవ నిఘా, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేసిన పోలీసులు 31 మంది క్యారియర్లు, వారి ఆర్థిక లావాదేవీల లింకులతో పాటు సుమారు 230 మంది వినియోగదారులను గుర్తించి నెట్‌వర్క్‌ను మ్యాప్ చేశారు.

**అర్ధరాత్రి మెరుపు ఆపరేషన్**

సాంకేతిక ఆధారాలను సేకరించిన అనంతరం ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, హెచ్‌న్యూ (HNEW) సిబ్బంది సంయుక్తంగా ఆగస్టు 12, 13 మధ్య రాత్రి ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఈ దాడిలో ముఠాకు చెందిన సంజయ్ మారి, కామేశ్ మారి, డంబు ఖోరా, అనసు ఖరా, సేథి రాకేష్‌లను అరెస్ట్ చేశారు. వీరిలో ఒకరు మైనర్ కాగా.. అతడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు.

**వినియోగదారులపైనా చర్యలు**

డ్రగ్స్ సరఫరాదారులతో పాటు వినియోగదారులపైనా పోలీసులు చర్యలు చేపట్టారు. సుమారు 100 మందిని అదుపులోకి తీసుకుని పరీక్షలు నిర్వహించగా 80 మందికి డ్రగ్స్ వినియోగం పాజిటివ్‌గా తేలింది. ఆర్‌ఎన్‌పీఎస్ (RNPS), ఈగల్ ఫోర్స్, తెలంగాణ పోలీసుల ఆధ్వర్యంలో క్రైమ్ నంబర్ 16/2026 కింద కేసు నమోదు చేశారు. మేజిస్ట్రేట్ జోక్యంతో అర్హులైన డ్రగ్స్ బానిసలకు డీఅడిక్షన్, పునరావాస చికిత్స అందించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఎండుతున్న ప్రాజెక్టులు.. మెదక్‌కు నీటి గండం

- సకాలంలో వర్షాలు లేక జలాశయాల్లో అడుగంటిన నీటిమట్టాలు
- మూడు పంట కాలాలుగా సాగుకు దూరమవుతున్న రైతులు
- డెడ్ స్టోరేజీకి చేరిన సింగూరు.. మంజీరాలోనూ చుక్క నీరు కరవు
- హైదరాబాద్‌తో పాటు గ్రామీణ ప్రాంతాల తాగునీటిపైనా ప్రభావం
- సింగూరులో ఇంటేక్ వెల్స్‌తో నీటిని అందించే అత్యవసర చర్యలు
- వర్షాభావం కొనసాగితే పరిస్థితి మరింత తీవ్రం



**మెదక్, సెప్టెంబర్ 20:**

ఉమ్మడి మెదక్ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తీవ్ర నీటి సంక్షోభానికి దారితీశాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ప్రధాన జలాశయాల్లో నీటిమట్టాలు గణనీయంగా పడిపోయాయి. దీంతో సాగునీటితో పాటు తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడుతోంది. ఎప్పుడూ జలకళతో కనిపించే ప్రాజెక్టులు ప్రస్తుతం వెలవెలబోతుండటంతో రైతులు, ప్రజల్లో ఆందోళన నెలకొంది.

**సాగుకు దూరమైన రైతులు**

ప్రాజెక్టుల్లో నీరు లేక పంట కాలువలు ఎండిపోవడంతో ఆయకట్టు ప్రాంతాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. మూడు పంట కాలాలుగా భూములను సాగు చేయకుండా బీడుగా వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలాశయాలపై ఆధారపడిన సాగు భూములు నీరు లేక వెలవెలబోతున్నాయి.

**సింగూరులో 4 టీఎంసీలే..**

ఉమ్మడి మెదక్ జిల్లాలోని జలాశయాలు స్థానిక ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకూ కీలక ఆధారం. సాధారణంగా ఈ సమయానికి సింగూరు ప్రాజెక్టులో 17 టీఎంసీల నీరు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం సుమారు 4 టీఎంసీలు మాత్రమే ఉన్నట్లు సమాచారం. అది కూడా డెడ్ స్టోరేజీ స్థాయిలో ఉండటంతో వినియోగానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంజీరా బ్యారేజీలోనూ నీటి నిల్వలు లేక ఇసుక మేటలు, గడ్డి దర్శనమిస్తున్నాయి. ఘనపురం, హల్దీవాగు, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు తగ్గిపోయాయి.

**ఇంటేక్ వెల్స్‌తో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

తాగునీటి సరఫరా నిలిచిపోకుండా అధికారులు అత్యవసర చర్యలు చేపట్టారు. సింగూరు ప్రాజెక్టు వద్ద ఇంటేక్ వెల్స్ ఏర్పాటు చేసి.. అందుబాటులో ఉన్న తక్కువ స్థాయి నీటిని, భూగర్భ జలాలను సేకరించి శుద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అనంతరం మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు మరికొంతకాలం కొనసాగితే తాగునీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వీవీఐపీ ఓటర్లకూ ఎస్ఐఆర్ నోటీసులు

- జైశంకర్ దంపతులు, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ కుటుంబానికి నోటీసులు
- మాజీ ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ, ఆయన భార్య పేర్లూ 'అన్‌మ్యాప్డ్' జాబితాలో
- జాన్ బ్రిట్టాస్ కుటుంబ సభ్యులకు పేర్లలో వ్యత్యాసాలపై నోటీసులు
- మాజీ సీఎం కేజ్రీవాల్, కుటుంబంలోని నలుగురికీ నోటీసులు
- నోటీసు ఇచ్చినంత మాత్రాన ఓటు హక్కు రద్దు కాదన్న ఎన్నికల అధికారులు
- ఆధారాలు సమర్పించిన తర్వాత వివరాలపై తుది నిర్ణయం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:**

ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో భాగంగా పలువురు ప్రముఖులకు ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆయన భార్య క్యోకో ఎస్. జైశంకర్, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్, ఆయన కుటుంబ సభ్యులు, మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, ఆయన భార్య తదితరులకు నోటీసులు అందాయి. వీరంతా న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లుగా నమోదై ఉన్నారు.

**'అన్‌మ్యాప్డ్' కేటగిరీలో..**

జైశంకర్ దంపతుల పేర్లను 'Unmapped with Last SIR' కేటగిరీలో చేర్చారు. గత ఎస్ఐఆర్ సందర్భంగా రూపొందించిన ఓటర్ల జాబితాతో ప్రస్తుత రికార్డులను అనుసంధానం చేయలేకపోవడంతో ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. వీరు న్యూఢిల్లీ నియోజకవర్గంలోని సుందర్‌బాగ్ ఎలక్టోరల్ పార్ట్‌లో ఓటర్లుగా నమోదై ఉన్నారు. ప్రవీణ్ సూద్, ఆయన భార్య వనితా సూద్, తల్లి కమ్లేష్ సూద్ పేర్లను కూడా ఇదే కేటగిరీలో గుర్తించారు. జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, ఆయన భార్య సునితా ద్వివేదీ పేర్లకూ ఇదే కారణంతో నోటీసులు ఇచ్చారు.

**పేర్లలో వ్యత్యాసాలతో మరికొందరికి..**

సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ కుటుంబ సభ్యులకు వేర్వేరు కారణాలతో నోటీసులు జారీ అయ్యాయి. ఆయన భార్య షీబా బ్రిట్టాస్ పేరులో వ్యత్యాసం ఉండటంతో 'Self Name Mismatch' కేటగిరీలో నోటీసు ఇచ్చారు. కుమారుడు ఆనంద్ బ్రిట్టాస్ రికార్డుల్లో తల్లిదండ్రుల పేర్లకు సంబంధించిన వ్యత్యాసం గుర్తించడంతో 'Parent Name Mismatch' కింద నోటీసు జారీ చేశారు. మాజీ ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కుటుంబ సభ్యులు, మాజీ సుప్రీం కోర్టు న్యాయమూర్తి రంజనా దేశాయ్ కుటుంబ సభ్యులకు కూడా ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసులు అందాయి.

**కేజ్రీవాల్ కుటుంబానికీ నోటీసులు**

మాజీ ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ఆయన భార్య సునీతా కేజ్రీవాల్, తల్లిదండ్రులు గోవింద్ రామ్ కేజ్రీవాల్, గీతా దేవి, కుమారుడు పుల్కిత్ కేజ్రీవాల్‌లకు కూడా 'Unmapped with Last SIR' కేటగిరీలో నోటీసులు జారీ అయ్యాయి. ఈ ఐదుగురి రికార్డులను గత ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాతో అనుసంధానించేందుకు అవసరమైన వివరాల్లో లోపాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**ఓటు హక్కు రద్దు కాదు**

ఎస్ఐఆర్ నోటీసు అందినంత మాత్రాన ఓటరు పేరు తొలగించినట్లు కాదని ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఓటరు వివరాలను ధ్రువీకరించేందుకు సంబంధిత వ్యక్తులు అవసరమైన పత్రాలు, ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించిన అనంతరం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నిర్ణయం తీసుకుంటారు. సరైన ప్రక్రియ, విచారణ అవకాశం లేకుండా ఓటరు పేరును తొలగించబోమని అధికారులు పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఎల్ఐజీ ఫ్లాట్లకు అలాట్‌మెంట్ లెటర్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 20:**

ఇందిరమ్మ ఎల్ఐజీ (LIG) ఫ్లాట్ల లబ్ధిదారులకు ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. రేపటి నుంచి లబ్ధిదారులకు అలాట్‌మెంట్ లెటర్లను అధికారికంగా వాట్సాప్ ద్వారా పంపించనున్నారు. దీంతో లబ్ధిదారులు తమకు కేటాయించిన ఫ్లాట్లకు సంబంధించిన పత్రాలను సులభంగా పొందవచ్చు.

**వెబ్‌సైట్‌లోనూ అవకాశం**

వాట్సాప్‌తో పాటు హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా అలాట్‌మెంట్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా డిజిటల్ విధానంలో పత్రాలను పొందేలా ఈ ఏర్పాట్లు చేశారు.

**రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్**

ఇదిలా ఉండగా, రాయదుర్గం మల్కం చెరువు వెనుక భాగంలో 2.85 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులకు రేపు శంకుస్థాపన జరగనుంది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని శంకుస్థాపన చేయనున్నారు.

# కారు ఢీకొని మూడేళ్ల బాలుడి మృతి

- ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన
- తండ్రితో కలిసి పార్సెల్ తీసుకెళ్లేందుకు వెళ్తుండగా ప్రమాదం
- ఢీకొట్టిన వెంటనే కారుతో పరారైన డ్రైవర్
- సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా కారును గుర్తించిన పోలీసులు
- డ్రైవర్‌ను గుర్తించి అరెస్ట్ చేయాలని కుటుంబ సభ్యుల డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 20:**

హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో హిట్ అండ్ రన్ ఘటనలో మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. తండ్రి మొహిదుద్దీన్ సాహెబ్‌తో కలిసి స్వీకార్ హోటల్ నుంచి పార్సెల్ తీసుకెళ్లేందుకు వెళ్తున్న ఇజాన్ ఉద్దీన్‌ను వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ కారుతో అక్కడి నుంచి పరారయ్యాడు.

**చికిత్స పొందుతూ మృతి**

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు తొలుత షాలిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఓవైసీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించిన పోలీసులు కారును గుర్తించినట్లు తెలిపారు. డ్రైవర్ ఎవరనే దానిపై దర్యాప్తు కొనసాగుతోందని, ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

**న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆవేదన**

డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా కారు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ఇజాన్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. కారు ఢీకొన్న తర్వాత బాలుడిని

కొంత దూరం ఈడ్చుకెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ డ్రైవర్‌ను ఇప్పటివరకు గుర్తించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిందితుడిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.




# స్నేహపూర్వక సమ్మేళనమే 'ప్రసాద్ పార్టీ

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- వైశ్య సంఘం గణేష్ మండపంలో ఉత్సవాలు.. హాజరైన ప్రజాప్రతినిధులు

**నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 20(డీడీ9 వార్త ) :**

వైశ్య సంఘం వినాయక మండపాల్లో నిర్వహించే 'ప్రసాద్ పార్టీ' కేవలం విందు మాత్రమే కాదని, అది వైశ్య సోదరుల స్నేహపూర్వక సమ్మేళనమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని గంజ్ ప్రాంతంలో ఉన్న పట్టణ వైశ్య సంఘం భవనంలో ఏర్పాటు చేసిన "ప్రసాద్ పార్టీ"కి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడటంలోనూ, సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలించడంలోనూ వైశ్యులు ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. వైశ్యులంతా ఐక్యతతో ఏకతాటిపై నిలిచి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గత 55 సంవత్సరాలుగా తాను క్రమం తప్పకుండా ఈ ప్రసాద్ పార్టీకి హాజరవుతున్నానని తన పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సంఘంలో సుదీర్ఘంగా 82 ఏళ్లుగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం ఎంతో గర్వకారణమని, యువజన సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు అత్యంత అద్భుతంగా సాగుతున్నాయని అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహంతో వేడుకలను నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైశ్య సేవా సంఘం గణేష్ మండలి అధ్యక్షుడు శివకుమార్ గుప్తా, పట్టణ వైశ్య సంఘం నాయకులు ఇల్లెందుల ప్రభాకర్ గుప్తా, మోటూరి మురళి గుప్తా, అర్వపల్లి పురుషోత్తం గుప్తా, శ్రీనివాస్ గుప్తా, అనుబంధ సంఘాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.





# యోగా లేదా జిమ్.. ఏది బెస్ట్ ఆప్షన్?



శరీరాన్ని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే యోగా లేదా వ్యాయామం చేయాల్సిందే.. ప్రస్తుతం ఎక్కువ మంది ఊబకాయం సమస్యతో సతమతమవుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో జిమ్‌లో చెమటలు కక్కుతున్నారు. కొంతమంది వ్యాయామ శిక్షణపై దృష్టి పెడతారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం వ్యాయామం అనే శారీరక ప్రక్రియను చేస్తారు. ఇలా చేయడం వలన శారీరకంగానే కాదు మనసికమగా కూడా అనేక ప్రయోజనాలను పొందుతారు.మరోవైపు ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను దూరం చేసుకోవాలనుకునే వారు యోగా, ప్రాణాయామం చేస్తుంటారు. యోగాతో మీరు ఏకాగ్రత నేర్చుకుంటారు. యోగా .. జిమ్ వర్కౌట్‌లలో ఏది బెటర్ అనే ప్రశ్న కొంతమందికి ఎప్పుడూ మనసులో ఉంటుంది. ఈ విషయంపై కల్ట్ ట్రాన్స్‌ఫార్మ్ యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రోల్లా అనేక విషయాలను చెప్పారు. ఆరోగ్యంగా ఉండాలంటే శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడం చాలా అవసరమని చెబుతున్నారు. దీంతో ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి. అంతేకాదు మన శరీరంలోని కండరాలు కూడా ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. యోగా, జిమ్ వ్యాయామాల మధ్య వ్యత్యాసం ఉంది. ఈ రెండింటి మధ్య తేడా గురించి ముందుగా చెప్పుకుందాం.

**యోగా అంటే ఏమిటి?**

యోగా అనేది భౌతిక భంగిమలు, ధ్యానం, లోతైన శ్వాసలతో కూడిన ఒక పురాతన అభ్యాసం. యోగా అనేది శరీరం, మనస్సు, ఆత్మ ఐక్యంగా ఉండే ఆధ్యాత్మిక ప్రక్రియ. ఈ పదం హిందూమతం, జైనమతం, బౌద్ధమతంలో ధ్యాన ప్రక్రియకు సంబంధించినది. యోగా అనేది సంస్కృత పదం యుజ్ నుండి వచ్చింది. అంటే సేకరించడం లేదా బంధించడం. యోగా ఒక ఆధ్యాత్మిక క్రమశిక్షణ. యోగాలో సూర్య నమస్కారంతో సహా అనేక ఆసనాలు, ప్రాణాయామం ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు గణనీయంగా యోగా పట్ల ఆసక్తిని చూపిస్తున్నారు.

**జిమ్ వ్యాయామం**

జిమ్ గురించి అందరికీ తెలుసు. వ్యాయామశాలలో వివిధ యంత్రాలతో పాటు గాడ్జెట్లను ఉపయోగించి వ్యాయామం చేస్తారు. ఫిట్ , టోన్డ్ బాడీని పొందడానికి చాలా మంది జిమ్‌కి వెళ్తుంటారు. ప్రజలు జిమ్‌కి వెళ్లి కార్డియో, కాళ్లు , వెయిట్ లిఫ్టింగ్ వంటి వివిధ వ్యాయామాలు చేస్తారు.

**రెండింటిలో ఏది మంచిది?**

రెండు ఆరోగ్యానికి మేలు చేసేవే అని యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రోలా చెబుతున్నారు. యోగాలో శ్వాస నియంత్రణ అంటే ప్రాణయ, ఆసనం .. యోగా నిద్ర వంటి అంశాలు ఉంటాయి. ఇది శరీరం, మనస్సు రెండింటినీ రిలాక్స్ చేస్తుంది. అదే సమయంలో జిమ్ వ్యాయామంలో శక్తి శిక్షణ ఉంటుంది. ఇది జీవక్రియ. కండరాలకు మంచిది. నిపుణుల అభిప్రాయం ప్రకారం మీ శరీర తత్వాన్ని తెలుసుకోండి. మరింత సౌకర్యవంతంగా ఉన్న వాటిని ఆచరించండి.







# వెజిటేరియన్స్ ఎక్కువగా ఉన్న దేశాలెంటో తెలుసా

కొంతమంది చిన్నప్పటి నుంచీ మాంసాహారులు అయినప్పటికీ.. కారణాలు ఏమైనా కాలక్రమంలో శాకాహారులుగా మారిపోతున్నారు. ఇంకొంత మంది పుట్టినప్పటి నుంచీ శాకాహారులుగా ఉన్నా తదనంతర కాలంలో మాంసాహారులవుతున్నారని అంటుంటారు. ఏది ఏమైనప్పటికీ.. ఎవరు ఎలా మారినప్పటికీ.. శాకాహారం తినడమా, మాంసాహారం తినడమా అనేది పూర్తిగా వ్యక్తిగత ఎంపికనే చెప్పాలి. అయితే ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా చలా మంది ఇప్పుడు శాకాహారాన్ని అవలంభిస్తున్నారని అంటుంటారు. లైఫ్ స్టైల్ ఛేంజ్ లో భాగంగా ఆహారపు అలవాట్లనూ మారుస్తున్నారు. కొంతమంది హెల్త్ కాన్సియష్ కాస్త ఎక్కువగా ఉండి కూడా ఇలాంటి నిర్ణయాలు చేస్తున్నారని చెబుతుంటారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా శాకాహారుల సంఖ్య పెరుగుతుందని అంటుంటారు.

**శాకాహారులు ఎక్కువగా ఉన్న టాప్ - 5 దేశాలు...**

**భారతదేశం:**

అత్యధిక సంఖ్యలో శాకాహారం తినేవారు ఎక్కువగా ఉన్న దేశాల్లో అగ్రస్థానంలో ఉంది భారత్. ఇక్కడ ఉన్న జనాభాలో సుమారు 30శాతం మందికి పైగా ప్రజలు శాకాహారమే తింటారని చెబుతున్నారు. ఈ శాతంలో ప్రధాన వాటా హర్యానా, రాజస్థాన్ లలో నివసిస్తున్న ప్రజలని అంటుంటారు!

**ఇజ్రాయెల్:**

ఇజ్రాయెల్ జనాభాలో సుమారు 13 శాతం మంది ప్రజలు శాకాహారులే. మనిషి తన ఆకలిని తీర్చుకోవడానికి జంతువులను చంపడాన్ని సమర్థించలేమని ఇక్కడ నివసించే కొంతమంది ప్రజానికం బలంగా నమ్ముతారంట.

**తైవాన్:**

శాఖాహర ఆహారాన్ని భుజించే జనాభా ఎక్కువగా ఉన్న దేశాల్లో తైవాన్ మూడో స్థానంలో ఉంది. ఇక్కడున్న మొత్తం జనాభాలో 12 శాతం మంది ఇక్కడ శాకాహారాన్నే అనుసరిస్తున్నారు. ఇక్కడ వెజ్ రెస్టారెంట్స్ చాలానే ఉన్నాయి.

**ఇటలీ:**

ఇటలీ జనాభాలో సుమారు 10 శాతం మంది ప్రజలు వెజిటేరియన్స్. వాస్తవానికి ఇటలీ నాన్ వెజ్ వంటకాలకు ఎక్కువ ప్రసిద్ధి చెందినప్పటికీ.. ఇక్కడ శాకాహారుల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోందని తాజా నివేదికలు చెబుతున్నాయి.

**ఆస్ట్రియా:**

ప్రపంచ వ్యాప్తంగా శాకాహర ఆహారాన్ని అనుసరించే వ్యక్తుల విషయంలో ఆస్ట్రియా ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ సుమారు 9 శాతం మంది.



# పరగడపున పనీర్ తింటే.. బోలెడు లాభాలు



చీజ్ అని కూడా పిలువబడే పనీర్, వివిధ రకాల వంటకాలలో ఉపయోగించగల బహుముఖ ప్రయోజనాలు, రుచికరమైన పదార్థం. కానీ., ఉదయాన్నే పనీర్ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా..? మీ అల్పాహార దినచర్యలో పనీర్ చేర్చడం మీ మొత్తం శ్రేయస్సుకు ప్రయోజనకరంగా ఉండటానికి వివిధ కారణాలను ఒకసారి చూద్దాం.

**ప్రోటీన్ పుష్కలంగా:**

పనీర్ అధిక నాణ్యత ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. ఇది మీ రోజును ప్రారంభించడానికి అనువైన ఆహారంగా మారుతుంది. కణజాలాలను నిర్మించడానికి, మరమ్మతు చేయడానికి, అలాగే ఆరోగ్యకరమైన ఎముకలు, కండరాలు, చర్మాన్ని నిర్వహించడానికి ప్రోటీన్ అవసరం.

**జీవక్రియను పెంచుతుంది:**

ఉదయాన్నే పనీర్ తినడం ద్వారా, మీరు మీ జీవక్రియను పెంచుకోవచ్చు. వేగవంతమైన జీవక్రియ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇంకా రోజంతా మీకు మరింత శక్తిని అందిస్తుంది.

**మీకు కడుపు నిండుగా అనిపించేలా చేస్తుంది:**

పనీర్ అనేది మిమ్మల్ని ఎక్కువ కాలం సంతృప్తిగా, కడుపు నిండుగా ఉండేలా చేయడానికి సహాయపడే ఒక నింపే ఆహారం. ఇది రోజు చివరిలో అనారోగ్యకరమైన ఆహారాలను అతిగా తినడం, అల్పాహారం తీసుకోవడం నివారించవచ్చు.

**అవసరమైన పోషకాలను అందిస్తుంది:**

పనీర్ కాల్షియం, భాస్వరం, విటమిన్ ఎ, బి 12 వంటి విటమిన్లకు మంచి మూలం. బలమైన ఎముకలు, దంతాలు, మొత్తం రోగనిరోధక శక్తిని నిర్వహించడానికి ఈ పోషకాలు ముఖ్యమైనవి.

**రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది:**

ఉదయం పనీర్ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది డయాబెటిస్ లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి ముఖ్యమైనది. పనీర్ లోని ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు రక్తప్రవాహంలోకి చక్కెర శోషణను నెమ్మదిస్తాయి.





# బుద్ధారంలో విజయవంతంగా ఉచిత కంటి వైద్య శిబిరం



**ఖమ్మం రాజముద్ర న్యూస్:**

లయన్స్ కంటి హాస్పిటల్ వైరా ఆధ్వర్యంలో, భక్త రామదాసు సర్వీస్ సొసైటీ నేలకొండపల్లి సహకారంతో బుద్ధారం గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది.ఈ శిబిరాన్ని బుద్ధారం గ్రామ సర్పంచ్ మేళ్లచెరువు సత్యం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐ క్యాంప్ చైర్మన్ గెల్లా జగన్మోహనరావు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా భక్త రామదాసు సర్వీస్ సొసైటీతో కలిసి లయన్స్ కంటి హాస్పిటల్ నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా ఎంతోమందికి కంటి చూపును ప్రసాదించడం హర్షించదగిన విషయం అన్నారు. ఈ శిబిరంలో దాదాపు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 25 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. లయన్స్ కంటి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, హాస్పిటల్ నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పచ్చా తిరుపతయ్య, కార్యదర్శి గెల్లా వెంకటరమణ గుప్తా, కోశాధికారి దండా రవీంద్రబాబు, ఉపాధ్యక్షులు గంజికుంట్ల వెంకన్న, తెల్లగొర్ల లింగస్వామి, కె.వెంకటచారి, గ్రామ పెద్దలు అరేకట్ల గురవయ్య, అరేకట్ల కొండలరావు, సామినేని వాసు, కాకాని ధనమూర్తి, మాజీ అధ్యక్షులు వేటుకూరి వెంకటరామారావు, యలమద్ది లెనిన్, పొన్నగంటి శ్రీనివాసరావు, కె.దేవీప్రసాద్, బి.నాగేశ్వరరావు, లక్షణ్ రావు, ఎర్ర సైదయ్య, కొత్త వేణు, రేలా నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విహారిక కాలనీలో ఘనంగా వినాయక పూజలు



- అన్న ప్రసాద కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బండారి రవీందర్, మాజీ కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:**

విహారిక కాలనీలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ బండారి రవీందర్, కాలనీ అధ్యక్షురాలు స్వర్ణలత రమణారెడ్డి ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న ప్రసాద కార్యక్రమంలో కాలనీ వాసులు ఉత్సాహంగా పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పూజా కార్యక్రమం, అన్న ప్రసాదంతో విహారిక కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వినాయక చవితి ఉత్సవాలు కాలనీ వాసుల్లో ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందించేలా కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కాలనీ కమిటీ సభ్యులు, స్థానికులు సహకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమంలో భక్తిని చాటుకున్నారు.







# గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి
- గణనాథుల చెంతకు జక్క.. మండపాల సందర్శనతో భక్తుల్లో ఉత్సాహం!
- విహారిక కాలనీలో అన్నప్రసాద వితరణ
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి
- పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్లలో గణనాథులకు ప్రత్యేక పూజలు



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్లలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్ సాయంత్రం సందర్శించారు. గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులతో మాట్లాడి వేడుకల వివరాలను తెలుసుకున్నారు.

**గణనాథునికి ప్రత్యేక పూజలు**

వినాయక చవితిని పురస్కరించుకుని పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్ల పరిధిలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో స్వామివారి ఆశీస్సులు పొందారు. మండపాల వద్ద నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాల్లో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పలు మండపాలను సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వినాయక ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు కాలనీవాసుల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు.

**విహారిక కాలనీలో అన్నప్రసాద వితరణ**

అనంతరం విహారిక కాలనీలో అరికట్ల రమాదేవి, రామాంజనేయ రెడ్డి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. వినాయకుడి దర్శనానికి వచ్చిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కార్యక్రమంలో కాలనీ వాసులు, మహిళలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమం సందర్భంగా కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, వినాయకుని ఆశీస్సులు పొందారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్, ప్రధాన కార్యదర్శి రఘువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు, పెద్దలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. మండపాల వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రోప్ స్కిపింగ్ క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

- రాష్ట్రస్థాయి పోటీల్లో పీర్జాదిగూడ విద్యార్థిని అభియ షారోన్ సత్తా..
- మూడు పతకాలతో ప్రతిభ చాటిన చిన్నారి
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రోప్ స్కిప్పింగ్ క్రీడలకు మంచి అవకాశాలు
- తెలంగాణ రాష్ట్ర రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్క వెంకట్ రెడ్డి





**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:**

రోప్ స్కిప్పింగ్ క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి అవకాశాలు ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. నారపల్లిలోని రోటర్ డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి జంప్ రోప్ ఛాంపియన్‌షిప్–2026 పోటీలను జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని అందిస్తాయని తెలిపారు. విద్యార్థులలో క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదల, పోటీతత్వ స్ఫూర్తిని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రోప్ స్కిప్పింగ్ వంటి క్రీడల్లో నిరంతర సాధన, శిక్షణతో ప్రతిభను మెరుగుపరుచుకోవచ్చని అన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించడంతో పాటు భవిష్యత్‌లో ఏషియన్ గేమ్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటి దేశానికి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ, అవకాశాలు అందితే వారు ఉన్నత స్థాయికి ఎదగగలరని తెలిపారు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు.

**మూడు పతకాలతో అభియ షారోన్ ప్రతిభ**

ఇదిలా ఉండగా, పీర్జాదిగూడకు చెందిన చాబతుల విజయ్ బాబు, అనిత దంపతుల కుమార్తె చాబతుల అభియ షారోన్ రాష్ట్రస్థాయి జంప్ రోప్ ఛాంపియన్‌షిప్–2026 పోటీల్లో ప్రతిభ కనబరిచింది. నారపల్లిలోని రోటర్ డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న అభియ షారోన్ అండర్–11 విభాగంలో పాల్గొని మూడు పతకాలను సాధించింది. ఇంజురెన్స్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించి తన ప్రతిభను చాటుకుంది. అదేవిధంగా రిలే స్పీడ్ విభాగంలోనూ బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. డబుల్ అండర్ విభాగంలో వెండి పతకాన్ని సాధించింది. మొత్తంగా రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకాన్ని సాధించిన అభియ షారోన్ క్రీడా ప్రతిభను చాటుకుంది. చిన్న వయసులోనే రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినిని అభినందిస్తూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**పాఠశాల సిబ్బంది అభినందనలు**

రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన అభియ షారోన్‌ను రోటర్ డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. క్రీడల్లో విద్యార్థులు సాధిస్తున్న విజయాలు పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణమని పేర్కొన్నారు. అభియ షారోన్ మరింత శిక్షణతో ఉన్నత స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, డైరెక్టర్ శ్వేతా రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రూపా రెడ్డి, ఈవీ రమణ, క్రీడా విభాగం బాధ్యుడు సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను నిర్వాహకులు అభినందించారు.



# అంగరంగ వైభవంగా గణేశుని నిమజ్జనం

- సంజన మాలతి కాంప్లెక్స్ లో భక్తిశ్రద్ధలతో వేడుకలు
- రూ.1,55,001కు లడ్డూ వేలం



**ఉప్పల్, రాజముద్ర న్యూస్:**

ఉప్పల్ డివిజన్ సౌత్ స్వరూప్ నగర్ కాలనీలోని సంజన మాలతి కాంప్లెక్స్‌లో అపార్ట్‌మెంట్ వాసులు గణేశుని నిమజ్జన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అపార్ట్‌మెంట్ వాసులంతా ఉత్సాహంగా పాల్గొని గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో దుగ్యాల రజిని, వేణుగోపాల్ రావు రూ.1,55,001/- కు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం అపార్ట్‌మెంట్ వాసులు, ముఖ్యంగా మహిళలు, చిన్నారులు ఆటపాటలతో సందడి చేస్తూ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఉపాధ్యక్షుడు జలంధర్ రెడ్డి, కార్యదర్శి వెంకట్ రెడ్డి, కమిటీ సభ్యులు పురుషోత్తం రావు, కృష్ణతో పాటు అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు. గణనాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ముగించారు.

# కుంకుమార్చన పూజలు



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్ :**

కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో 28 వ వార్షికోత్సవ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అర్చకులు శరత్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుండి 100 మంది మహిళలచే కుంకుమ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శరత్ శర్మ మాట్లాడారు ఫ్రెండ్స్ అసోసియేషన్ 28 వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం నుండి గణేష్ మండపం దగ్గర కుంకుమ పూజలు నిర్వహించడం జరిగిందని, ఈ పూజలో పాల్గొన్న వారికి అష్ట ఆయురారోగ్యాలతో మీరు కోరుకున్న కోరికలు నెరవేరుతాయనీ అన్నారు, అనంతరం పాత అంజయ్య, గజవాడ రవి, నంగునూరు శేఖర్, శశిరేఖ, సునీత,మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలోని తక్కడు బాట్ల విద్యానగర్ కాలానిలో గత 28 సంవత్సరాలుగా ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులమందరం కలిసి వినాయక పండుగని పురస్కరించుకొని కుంకుమ పూజ రోజు పలహారం , మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం సాంస్కృత కార్యక్రమాలు రాత్రి అన్నప్రసాదన్న వితరణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ప్రభాకర్ యాదవ్ ,పాత సుదర్శన్, విగ్రహ దాత పాత అంజయ్య లక్ష్మీ దంపతులు, అన్నదాత నంగునూరి నీరజ శేఖర్ దంపతులు, మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

# మురుగు కాలువలు శుభ్రం

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**



రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామం లో గతంలో ఎన్నో రోజుల నుండి మట్టితో పూడ్చుక పోయినా మురుగు కాల్వలను జెసిబి తో పాలకవర్గ సమక్షం లో సర్పంచ్ తాండ్ర మనిషా రామస్వామి, ఉప సర్పంచ్ ముత్యాలు, మురికి కాలువలను మట్టి తొలగించి మురుగునీరు వెళ్లిపోయే విధంగా జెసిబి తో శుభ్రం చేశారు, ఈ కార్యక్రమంలో రాజు వార్డ్ మెంబర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్య వైపు శ్రీజ అడుగులు

- నీట్ లో స్టేట్ ర్యాంక్ 2503
- ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**



రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామానికి చెందిన టంకరి శ్రీజ నీట్ ప్రవేశ పరీక్షలో 2503 స్టేట్ ర్యాంక్ సాధించి కామారెడ్డిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి, ఇష్టపడి చదవడం వల్లే వైద్య విద్యలో సీటు సాధించగలిగానని తెలిపారు. భవిష్యత్తులో వైద్యురాలిగా స్థిరపడి పేద ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. శ్రీజ వైద్య విద్య వైపు అడుగులు వేయడంపై తండ్రి టంకరి రాజేందర్, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కష్టపడి చదివిన చదువుకు తగిన ఫలితం దక్కిందని సంతోషం వెలిబుచ్చారు. శ్రీజను స్థానికులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ముమ్మరంగా గంగమ్మ వాగు బ్రిడ్జి పనులు

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**



రామారెడ్డి మండలం గంగమ్మ వాగు బ్రిడ్జి పనులు ముమ్మరంగా వేగంగా కొనసాగుతున్నాయి, గత మూడు సంవత్సరాల నుండి కొనసాగుతున్న బ్రిడ్జి పనులు గతంలో వర్షాలు పడ్డాయి అంటే చాలు ప్రజలు ఇబ్బందులకు గురై కామారెడ్డి వెళ్లే రాకపోకలు ఆగిపోవడంతో ప్రాంతవాసులు చాలా ఇబ్బందులు పడ్డారు, ఎట్టకేలకు బ్రిడ్జి పనులు వారం 15 రోజులలో పూర్తికానునందున ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తల్లాడ మండల నూతన కమిటీ ఎన్నిక

**ఖమ్మం రాజముద్ర న్యూస్ :**



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తల్లాడ మండల నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ఎస్ రెడ్డి, సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు.తల్లాడ మండల అధ్యక్షుడిగా బోడ శ్రీను, ఉపాధ్యక్షులుగా కోడూరు వీరకృష్ణ, కార్యదర్శిగా దిరిశాల వీరభద్రం, కోశాధికారిగా తేల్లాపుట్ట వెంకటనారాయణ, సహాయ కార్యదర్శిగా షేక్ మహారాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా రావుల గోపిగౌడ్, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా నారపోగు ప్రసాద్, చిత్తలూరి రమేష్‌లను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల నూతన కమిటీ తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మోదుగు రవికుమార్, ఎక్కిరాల బాబు, ఆంజనేయులు, తేలపుట్ట వెంకటేశ్వర్లు, లాలయ్య, ప్రసన్నకుమార్, రేగళ్ల శ్రీనివాసరావు, భూక్య ధనలక్ష్మి పాల్గొన్నారు.





# కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ లోకి భారీ చేరికలు

**మోటకొండూరు, రాజముద్ర న్యూస్:**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని మోటకొండూరు మండల కేంద్రంలో మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజి ఎమ్మెల్యే, గొంగిడి సునిత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. హరీష్ రావు వంగపల్లిలో మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి, భారీ బైక్ ర్యాలీతో మోటకొండూరు మండల కేంద్రానికి తరలివచ్చారు. అనంతరం పార్టీ శ్రేణులు నిర్వహించిన ర్యాలీలో హరీష్ రావు పాల్గొని, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మోటకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు సిరబోయిన మల్లేష్ యాదవ్, అనంతుల శోభన్ రెడ్డి, మెట్టు పద్మ రెడ్డి తదితరులు సుమారు 2,000 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గొంగిడి సునిత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి హరీష్ రావు పార్టీలోకి ఆహ్వానించారు. మోటకొండూరు సబ్‌స్టేషన్‌ను సందర్శించిన హరీశ్‌రావు లాగ్ బుక్ లేక పోవడంతో ఆగ్రహం.. హరీష్ రావు మాట్లాడుతూ. రైతుల కష్టాలు తెలుసుకునేందుకు సబ్‌స్టేషన్‌కు వస్తే లాగ్‌బుక్ మాయమైంది. ఎప్పుడు కరెంట్ వచ్చింది.. ఎప్పుడు నిలిచిపోయింది.. ఎన్ని గంటలు త్రీ ఫేజ్ విద్యుత్ ఇచ్చారో లాగ్‌బుక్‌లో నమోదు చేస్తారు...రైతులకు 6–7 గంటల కరెంట్ కూడా అందడం లేదు.. పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తామన్న ప్రభుత్వం.. కరెంట్ ఎందుకు రావడం లేదో సమాధానం చెప్పాలి... కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారు మీరు ఎందుకు ఇవ్వడం లేదు. రైతులకు రైతుబంధు లేక కరెంటు లేక వరి పంటలు ఎండిపోయి గుండెపోటుతో పురుగుల మందు తాగి చనిపోతున్నారు. కేసీఆర్ కరోనా కాలంలో కూడా రైతులకు రైతుబంధు ఆపలేదు మీరు ఎందుకు ఆపుతున్నారు. మీరు రైతులను చాలా ఇబ్బంది పెడుతున్నారు. కేసీఆర్ మీద కేటీఆర్ మీద మా మీద దృష్టి పెట్టినట్టు రైతుల మీద దృష్టి పెట్టండి. రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి పెట్టండి.. రైతుల పంటలు కాపాడేందుకు కృషి చేయాలి.. కృష్ణా, గోదావరి నదుల నుంచి అన్ని గేట్లు ఎత్తి రైతులకు నీళ్లు అందేటట్టు చూడాలి రైతాంగాన్ని ఆదుకోవాలి. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బూడిద బిక్షమయ్య గౌడ్, పైళ్ల శేఖర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ,మాజీ డిసిసిబి చైర్మన్, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, నల్గొండ జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి,భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు, బిఆర్ఎస్ నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి గారితో పాటు అన్ని మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోరాటాలతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం

- సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి

**ఆత్మకూర్(ఎం). రాజముద్ర న్యూస్ :**



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండలం. ప్రజా పోరాటాలతోనే చట్టాలు వస్తాయని,ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని,చట్టాల అమలుకు పోరాటాలు చేయవలసి వస్తుందని,మాజీ శాసనసభ్యులు సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు,మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం ఆధ్వర్యంలో లో లెవెల్ బ్రిడ్జిలను హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణ సాధనకై చేపట్టిన రెండు రోజుల పాదయాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ నుండి నేటి వరకు ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేపట్టాయని,ప్రజా సమస్యలు,రైతాంగ సమస్యలు, వ్యవసాయ కూలీల సమస్యలు,సంఘటిత అసంఘటిత కార్మిక సమస్యల పైన ఉద్యమాలు చేపడుతున్నాయని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటా లలో ఎప్పుడూ ముందుంటుందని, మండలంలోని లో లెవెల్ బ్రిడ్జిలు రాయిపల్లి కాలువపల్లి మధ్య, ఆత్మకూరు మొరిపిరాల గ్రామాల మధ్య,ఆత్మకూరు కొరటికల్ గ్రామాల మధ్య,రహీంఖాన్ పేట పోతిరెడ్డిపల్లి మధ్య,సారగండ్ల గూడెం పారుపల్లి,రాఘవాపురం కూరెళ్ళ గ్రామాల మధ్యలో, కూరెళ్ళ పల్లెర్ల మధ్యలో,లింగరాజు పల్లి వలిగొండ హైవే రోడ్డు మధ్యలో ఉన్న లో లెవెల్ బ్రిడ్జిలను హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణ సాధనకై మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేస్తారని అన్నారు.పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొంటారని తెలిపారు. పాదయాత్రలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు,మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం,md. నయీమ్,గుర్రం రాజమణి,జక్క దయాకర్ రెడ్డి,బొబ్బల లాల్ రెడ్డి,అంబోజు రాములు,జల్ది రాములు,మజ్జిగ నరసయ్య,కల్వల నరసయ్య,మారుపాక అంజయ్య,సోలిపురం లింగారెడ్డి,గాజుల సిద్ధులు, పాదయాత్రలో పాల్గొనగా జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి,సహాయ కార్యదర్శిలు బోలగాని సత్యనారాయణ,చేడే చంద్రయ్య,జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్,చెక్క వెంకటేష్ , కళ్లెం కృష్ణ,కుసుమని హరిచంద్ర, పేర బోయిన మహేందర్, బండి జంగమ్మ జిల్లా కౌన్సిల్ సభ్యులు బబ్బూరి శ్రీధర్,తెలంగాణ ప్రజా నాట్యమండలి కళాకారులు ఖుషి పాక నరసింహ, కలకొండ సంజీవ,గణేష్ , కట్ల యాదగిరి, మోత్కూర్ మోటకొండూర్ కార్యదర్శులు అన్నెపు వెంకటేష్,గాదగాని మాణిక్యం పాదయాత్రకు సంఘీభావం తెలుపగా అన్ని గ్రామాల నుండి పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాలజాతి ముద్దుబిడ్డకు కన్నీటి వీడ్కోలు

- అభినవ అంబేద్కర్ గా కీర్తి గడించిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ జగదీశ్ మృతి
- రోడ్డు ప్రమాదంలో దుర్మరణం.. యావత్ ఖమ్మం జిల్లా దిగ్భ్రాంతి
- వేలాది ప్రాణాలకు భరోసానిచ్చిన వైద్యుడి ఆకస్మిక మృతి.. కన్నీరుమున్నీరవుతున్న మాలజాతి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :**



మాలజాతి ముద్దుబిడ్డ.. వైద్యరంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ జగదీశ్ ఇక లేరు. రోడ్డు ప్రమాదంలో ఆయన దుర్మరణం చెందడంతో యావత్ ఖమ్మం జిల్లా తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆయన మృతివార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, అభిమానులతో పాటు మాలజాతి కన్నీరుమున్నీరవుతోంది. మమతా హాస్పిటల్‌లో న్యూరో సర్జన్ హెచ్ఓడీగా సేవలందించిన డాక్టర్ జగదీశ్.. ఎన్నో క్లిష్టమైన న్యూరో శస్త్రచికిత్సలు నిర్వహించి అనేక మంది ప్రాణాలను కాపాడిన వైద్యుడిగా పేరు సంపాదించుకున్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యం అందిస్తూ వారి కుటుంబాల్లో ఆశలు నింపిన వైద్యుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వైద్య వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా సేవగా భావించిన డాక్టర్ జగదీశ్.. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు అండగా నిలిచారని ఆయనను పరిచయం ఉన్నవారు గుర్తుచేసుకుంటున్నారు. తన ప్రతిభతో వైద్యరంగంలో ఎదగడంతో పాటు సామాజికంగా కూడా ప్రత్యేక ముద్ర వేసుకున్న ఆయనను పలువురు అభినవ అంబేద్కర్' గా కీర్తించేవారు.

**ఒక్క ప్రమాదం.. ఎన్నో గుండెల్లో విషాదం**

ఎందరో ప్రాణాలను కాపాడిన వైద్యుడి ప్రాణమే రోడ్డు ప్రమాదంలో అనంతలోకాలకు వెళ్లడం విషాదాన్ని మరింత పెంచింది. ఆయన ఆకస్మిక మృతితో ఖమ్మం జిల్లా వైద్య రంగంతో పాటు సామాజిక వర్గాల్లోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

**మాలజాతి కన్నీటి నివాళి**

డాక్టర్ జగదీశ్ మృతి మాలజాతికి తీరని లోటని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ జాతి నుంచి ఎదిగి ప్రముఖ వైద్యుడిగా వేలాది కుటుంబాలకు సేవలందించిన వ్యక్తిని కోల్పోవడం జీర్ణించుకోలేక పోతున్నామని కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆయన మరణవార్తతో మాలజాతి శోకసంద్రంలో మునిగిపో యింది. మాలజాతి ముద్దుబిడ్డకు కన్నీటి వీడ్కోలు పలుకుతూ.. ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పిస్తోంది. డాక్టర్ జగదీశ్ ఆకస్మిక మృతి ఆయన కుటుంబానికే కాదు.. ఆయన వైద్యసేవలు పొందిన వేలాది కుటుంబాలకు, అభిమానులకు, ఖమ్మం జిల్లా ప్రజలకు తీరని విషాదాన్ని మిగిల్చింది.

# హస్నాబాద్‌లో అన్నార్తుల ఆకలి తీర్చిన 'సత్య యూత్'

**ఖమ్మం రాజముద్ర న్యూస్ :**



గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సత్య యూత్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. స్థానిక ఎస్సై జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై జగదీష్ మాట్లాడుతూ.. పూజా కార్యక్రమాలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సుమారు 500 మందికి పైగా పేదలు, భక్తులకు అన్నదానం చేయడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువతను అభినందించిన గ్రామ పెద్దలు

గ్రామ సర్పంచ్ కొవ్వూరి పద్మ సత్తిరెడ్డి, నాయకులు కొవ్వూరి సందీప్‌రెడ్డి, మావిడాల శ్రవణ్, కొండెం పరమేష్లు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. యువత ఐక్యంగా ఇలాంటి సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కమిటీ సభ్యులు వినోద్, నవీన్, సతీష్, అశోక్, స్వరాజ్, శ్యామ్ పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. వార్డు సభ్యులు మోటాపోతుల పద్మప్రియ, మాగి వెంకన్న, పల్లి గోపి, మోటాపోతుల సరిత, తండ అంజయ్యతో పాటు గ్రామస్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గణేష్ నామస్మరణతో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.

# హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా సిరాజ్

- మొదటి రెండు మ్యాచ్‌లకు సిరాజ్ సారథ్యం
- వైస్ కెప్టెన్‌గా ఎడమచేతి వాటం పేసర్ సీవీ మిలింద్
- జాతీయ జట్టు విధుల్లో సిరాజ్ ఉంటే మిలింద్ కెప్టెన్సీ
- 15 మంది సభ్యులతో జట్టును ప్రకటించిన సీనియర్ సెలక్షన్ కమిటీ

**స్పోర్ట్స్ డెస్క్ :**

టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కీలక బాధ్యతలు అప్పగించింది. 202627 రంజీ ట్రోఫీ సీజన్‌లో భాగంగా మొదటి రెండు మ్యాచ్‌లకు హైదరాబాద్ జట్టుకు సిరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ మేరకు హెచ్‌సీఏ అధికారికంగా ప్రకటించింది. ఎడమచేతి వాటం పేసర్ సీవీ మిలింద్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు.

సీనియర్ సెలక్షన్ కమిటీ 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేసింది. ఒకవేళ జాతీయ జట్టుకు ఆడాల్సి వస్తే, సిరాజ్ అందుబాటులో లేని మ్యాచ్‌లకు మిలింద్ కెప్టెన్సీ బాధ్యతలు చేపడతాడని హెచ్‌సీఏ స్పష్టం చేసింది. జట్టులో అనుభవజ్ఞులైన బ్యాటర్లు తన్మయ్ అగర్వాల్, రాహుల్ సింగ్, వికెట్ కీపర్లు రాహుల్ రదేశ్, సాయి ప్రజ్ఞయ్ రెడ్డిలకు చోటు దక్కింది. వీరితో పాటు ఎం.అభిరత్ రెడ్డి, కె.హిమతేజ, వరుణ్ గౌడ్, తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డి, సీటీఎల్ రక్షణ్ రెడ్డి, అజయ్ దేవ్‌గౌడ్, రుతిక్ యాదవ్ మెండే, సాయి వికాస్ రెడ్డి జట్టులో ఉన్నారు.

రంజీ సీజన్‌లో భాగంగా హైదరాబాద్ తన తొలి మ్యాచ్‌ను అక్టోబర్ 11న త్రిపురతో ఆడనుంది. అయితే, ఈ మ్యాచ్ వేదిక ఇంకా ఖరారు కాలేదు. అనంతరం అక్టోబర్ 18 నుంచి విశాఖపట్నంలో ఆంధ్ర జట్టుతో తలపడనుంది.

ప్రస్తుతం సిరాజ్ వెస్టిండీస్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఈ సిరీస్ అక్టోబర్ 3న న్యూ ఛండీగఢ్‌లో ముగుస్తుంది. ఆ తర్వాత అక్టోబర్ 22 నుంచి న్యూజిలాండ్ పర్యటన ప్రారంభం కానుండటంతో, సిరాజ్ లభ్యతను బట్టి హెచ్‌సీఏ ఈ నిర్ణయం తీసుకుంది.



# టీమిండియాతో ఇంత త్వరగా టీ20 మ్యాచ్.. జపాన్ కోచ్ ఆశ్చర్యం

- భారత్‌తో మ్యాచ్ జరగనుందని నెల క్రితం వరకు తమకు తెలియదని చెప్పిన జపాన్ కోచ్
- ప్రధానుల స్థాయిలో జరిగిన చర్చల ఫలితంగానే ఈ మ్యాచ్ సాధ్యమైందని వెల్లడి
- ప్రపంచ ఛాంపియన్‌తో ఆడటం తమకు దక్కిన అద్భుతమైన అవకాశమని వ్యాఖ్య
- ఈ మ్యాచ్ ద్వారా జపాన్‌లో భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వడమే తమ లక్ష్యమన్న కోచ్

**స్పోర్ట్స్ డెస్క్ :**

ప్రపంచ ఛాంపియన్ భారత్‌తో టీ20 మ్యాచ్ ఆడతామనే విషయం నెల రోజుల క్రితం వరకు తమకు కనీసం తెలియదని జపాన్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ డుగాల్ బెడింగ్‌ఫీల్డ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఇదొక ఊహించని, అద్భుతమైన అవకాశమని అభివర్ణించాడు. ఇరు దేశాల ప్రధానుల స్థాయిలో జరిగిన ఉన్నతస్థాయి చర్చల తర్వాతే ఈ మ్యాచ్ హఠాత్తుగా ఖరారైందని బెడింగ్‌ఫీల్డ్ వెల్లడించాడు. ఈ చారిత్రక మ్యాచ్ కోసం తమ జట్టు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తోందని తెలిపాడు.

మంగళవారం టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్‌లో సుజుకి కప్ కోసం భారత్, జపాన్ జట్ల మధ్య ఈ టీ20 మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ టికెట్లన్నీ అమ్ముడయ్యాయి. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడలకు సన్నాహకంగా ఈ మ్యాచ్ ఉపయోగపడనుంది. ఆసియా క్రీడల్లో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో ఆడనుండగా, జపాన్ తన తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడనుంది.

ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో ప్రత్యేకంగా మాట్లాడుతూ బెడింగ్‌ఫీల్డ్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "ఈ మ్యాచ్ గురించి విన్నప్పుడు మొదట నమ్మలేకపోయాం. ఇది వందకు వంద శాతం మాకు ఆశ్చర్యం కలిగించింది. ప్రపంచ నంబర్ వన్ జట్టుతో ఆడేందుకు ఇదొక అద్భుతమైన అవకాశం. జపాన్‌లో నివసిస్తున్న భారతీయులు కూడా ఈ మ్యాచ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మైదానంలో గొప్ప వాతావరణం ఉంటుందని ఆశిస్తున్నాం" అని అన్నాడు.

అయితే, జట్టు సన్నద్ధతకు కొన్ని సవాళ్లు ఉన్నాయని బెడింగ్‌ఫీల్డ్ అంగీకరించాడు. "మా ఆటగాళ్లు దేశవిదేశాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉంటారు. మే నెల తర్వాత మా పూర్తి జట్టు కలిసి శిక్షణ తీసుకుంది ఇప్పుడే. టెక్నాలజీ సాయంతో ఆటగాళ్లను సమన్వయం చేస్తున్నాం. మరోవైపు, వర్ష సూచన కూడా ఆందోళన కలిగిస్తోంది. అయినా, మ్యాచ్ సజావుగా సాగుతుందని ఆశిస్తున్నాం" అని తెలిపాడు.



భారత జట్టు ఫైర్‌పవర్‌ను ఎదుర్కోవడం పెద్ద సవాలని బెడింగ్‌ఫీల్డ్ పేర్కొన్నాడు. "భారత్ వంటి మేటి జట్ల ఆటగాళ్ల విధ్వంసక శక్తి ముందు కొన్నిసార్లు చిన్న జట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అయితే, ఈ ఒత్తిడిని అధిగమించి, మైదానంలో గట్టి పోటీ ఇవ్వాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించాడు.

2020లో అండర్19 ప్రపంచకప్‌లోనూ భారత జట్టుతో తలపడిన అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు. ఆనాడు యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్ వంటి ఆటగాళ్లున్న భారత జట్టు చేతిలో తమ జట్టు ఓడిపోయిందని, అది గొప్ప అనుభవమని అన్నాడు. ఇప్పుడు సీనియర్ల స్థాయిలో మరోసారి భారత్‌తో ఆడటం ఆసక్తికరంగా ఉందని తెలిపాడు.

ఈ మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా, జపాన్‌లో క్రికెట్‌కు ప్రాచుర్యం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని బెడింగ్‌ఫీల్డ్ స్పష్టం చేశాడు. "మా ప్రదర్శన ద్వారా జపాన్‌లో భవిష్యత్ తరాల క్రీడాకారులకు స్ఫూర్తినివ్వాలనుకుంటున్నాం. వేలాది మంది పిల్లలు క్రికెట్‌ను తమ క్రీడగా ఎంచుకునేలా చేయడమే మా అంతిమ లక్ష్యం" అని తెలిపాడు.

భారత్‌జపాన్ దౌత్య సంబంధాల 75 వసంతాల వేడుకలో భాగంగా ఈ మ్యాచ్ ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 22న జపాన్ లోని సానో ఇంటర్నేషనల్ గ్రౌండ్ లో ఈ చారిత్రక మ్యాచ్ జరగనుంది.

# షఫాలీ శతక విధ్వంసం.. బంగ్లా బేజారు.. సూపర్ విక్టరీతో ఫైనల్‌కు భారత్

- సెమీ ఫైనల్లో బంగ్లాదేశ్‌పై 114 పరుగుల భారీ విజయం
- కేవలం 49 బంతుల్లో అజేయ శతకం బాదిన షఫాలీ వర్మ
- భారత మహిళల జట్టు ఆసియా క్రీడల ఫైనల్‌కు అర్హత
- భారీ లక్ష్య ఛేదనలో 81 పరుగులకే కుప్పకూలిన బంగ్లాదేశ్

**స్పోర్ట్స్ డెస్క్ :**



ఆసియా క్రీడల మహిళల క్రికెట్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. యువ ఓపెనర్ షఫాలీ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగి అద్భుత శతకంతో కదం తొక్కడంతో సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ 114 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది.

ఈ విజయంతో స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించి, పతకాన్ని ఖాయం చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు, బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 28 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో మంధాన 16 బంతుల్లో 27 పరుగులు చేసి ఔటైనా, పవర్ ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టానికి 72 పరుగులతో పటిష్ఠ స్థితిలో నిలిచింది.

మరోవైపు షఫాలీ తన జోరును కొనసాగించింది. కేవలం 24 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుని బంగ్లా బౌలింగ్‌ను చీల్చి చెండాడింది. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో జతకలిసిన షఫాలీ, మరో కీలక భాగస్వామ్యాన్ని నిర్మించింది. వీరిద్దరూ కలిసి 50 పరుగులకు పైగా జోడించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలో షఫాలీ తన విధ్వంసక ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తూ కేవలం 49 బంతుల్లోనే అజేయ శతకాన్ని పూర్తి చేసుకుంది.

ఆమె ఇన్నింగ్స్‌లో 9 భారీ సిక్సర్లు, 3 ఫోర్లు ఉన్నాయి. 204.08 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన షఫాలీ చివరి వరకు క్రీజులో నిలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 33 బంతుల్లో 40 పరుగులతో ఆమెకు అండగా నిలవడంతో, భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు సాధించింది.

196 పరుగుల భారీ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్, ఆరంభం నుంచే తీవ్ర ఒత్తిడికి గురైంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. పవర్ ప్లే ముగిసే సమయానికే 39 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కూడా బంగ్లా ఇన్నింగ్స్ ఏ దశలోనూ కోలుకోలేదు.

భారత బౌలర్లు విజృంభించడంతో 9 ఓవర్ల తర్వాత 49 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. చివరకు 15.4 ఓవర్లలో కేవలం 81 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో భారత జట్టు 114 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్లో అడుగుపెట్టింది. ఈ అద్భుత ప్రదర్శనతో భారత జట్టు స్వర్ణ పతకంపై కన్నేసింది.

# ఆసియా క్రీడలు.. భారత్ ఖాతాలో తొలి పతకం

- షూటింగ్‌లో రజతంతో భారత్ బోణీ
- ఎంఎంఏలో చారిత్రక పతకం ఖాయం చేసిన సుచిక
- ఉజ్బెకిస్థాన్‌ను చిత్తు చేసిన మహిళల హాకీ జట్టు
- వుషు, టెక్‌బాల్ క్రీడల్లో నిరాశ
- సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో మహిళల క్రికెట్ జట్టు పోరు

ఆసియా క్రీడల తొలిరోజే భారత్ పతకాల ఖాతా తెరిచింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇలవేనిల్ వలరివన్, సోనమ్ మస్కర్, విదర్సా వినోద్‌లతో కూడిన బృందం చైనా తర్వాత రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇదే తొలి పతకం.

**ఎంఎంఏలో చరిత్ర సృష్టించిన సుచిక**

మరోవైపు, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ)లో సుచిక సెమీఫైనల్‌కు దూసుకెళ్లి చరిత్ర సృష్టించింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా ఆమె భారత్‌కు ఈ క్రీడలో తొలి పతకాన్ని ఖాయం చేసింది.

**భారత మహిళల హాకీ జట్టు భారీ విజయం**

ఇక భారత మహిళల హాకీ జట్టు తమ ఆరంభ మ్యాచ్‌లో ప్రభంజనం సృష్టించింది. పూల్ మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌పై ఏకంగా 190 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి తమ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది.

**కొన్ని విభాగాల్లో భారత్‌కు నిరాశ**

అయితే, కొన్ని విభాగాల్లో భారత్‌కు నిరాశ ఎదురైంది. వుషులో పురుషుల చాంగ్‌క్వాన్ ఫైనల్‌లో సూరజ్ సింగ్ 11వ స్థానంతో సరిపెట్టుకోవడంతో పతకం ఆశలు గల్లంతయ్యాయి. అలాగే, టెక్‌బాల్‌లోనూ భారత్‌కు పతకాలు దక్కలేదు. మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కాంస్య పతక మ్యాచ్‌లలో భారత క్రీడాకారులు ఓటమి పాలయ్యారు. ఇప్పుడు అందరి దృష్టి మహిళల క్రికెట్ జట్టుపై ఉంది. గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో స్థానం కోసం హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది.



# టీ20 క్రికెట్‌లో స్మృతి మంధాన సంచలనం.. బాబర్, బట్లర్‌లను వెనక్కి నెట్టి ప్రపంచ రికార్డు!

- టీ20ల్లో అత్యధిక పరుగుల ప్రపంచ రికార్డు నెలకొల్పిన స్మృతి మంధాన
- పురుషులు, మహిళల క్రికెట్‌లో అగ్రస్థానానికి చేరిన భారత వైస్ కెప్టెన్
- న్యూజిలాండ్ క్రీడాకారిణి సూజీ బేట్స్‌ను అధిగమించి ఈ ఘనత
- ఆసియా క్రీడల సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై మెరుపు ఇన్నింగ్స్‌తో రికార్డు

**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన కెరీర్‌లో మరో అద్భుతమైన మైలురాయిని అందుకుంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. పురుషులు, మహిళల క్రికెట్‌లో కలిపి అత్యధిక పరుగులు సాధించిన క్రీడాకారిణిగా ఆమె ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఆసియా క్రీడల సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఘనతను ఆమె సొంతం చేసుకుంది.

కొరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో మంధాన కేవలం 19 బంతుల్లో 37 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. ఈ క్రమంలో న్యూజిలాండ్ మాజీ క్రీడాకారిణి సూజీ బేట్స్ పేరిట ఉన్న రికార్డును ఆమె అధిగమించింది.

ఈ మ్యాచ్‌కు ముందు మంధాన 170 ఇన్నింగ్స్‌లలో 4,751 పరుగులతో రెండో స్థానంలో ఉండగా, రికార్డు బ్రేక్ చేయడానికి కేవలం 8 పరుగులు అవసరమయ్యాయి. తన ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండు ఫోర్లు, రెండు సింగిల్స్‌తో ఈ మార్కును సులభంగా దాటేసింది. తాజా రికార్డుతో మంధాన 171 ఇన్నింగ్స్‌లలో 4,788 పరుగులతో అగ్రస్థానానికి చేరుకుంది.

ఈ జాబితాలో మంధాన, సూజీ బేట్స్ (4,758) తర్వాత పురుషుల టీ20ల్లో అగ్రగామిగా ఉన్న పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజం (4,596) మూడో స్థానంలో ఉన్నాడు. వీరి తర్వాత జోస్ బట్లర్ (4,292), భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (4,287) వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. ఈ రికార్డుతో మంధాన పురుషుల క్రికెట్‌లోని అగ్రశ్రేణి ఆటగాళ్లను కూడా వెనక్కి నెట్టడం విశేషం.



ఇక ఆసియా క్రీడల సెమీఫైనల్ విషయానికొస్తే, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 2023లో జరిగిన హాంగ్‌జౌ గేమ్స్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్న భారత జట్టు, ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్‌లో ఆతిథ్య జపాన్‌ను ఓడించి సెమీస్‌కు చేరుకుంది.






## ‘అవతార్’తో ‘రాకా’ పోలిక..
### క్లారిటీ ఇచ్చిన అల్లు అర్జున్ మేనేజర్

అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ కోలీవుడ్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రం ‘రాకా’ అంతర్జాతీయ స్టూడియోల భాగస్వామ్యంతో అత్యున్నత సాంకేతిక విలువలు, వీఎఫ్ఎక్స్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అయితే, ఈ సినిమాలోని విజువల్స్ హాలీవుడ్ సెన్సేషన్ మూవీ ‘అవతార్’ను మించిపోతాయంటూ దర్శకుడు శివ చక్రవర్తి ఇటీవల ప్రశంసించారు. దీంతో ఈ పోలికలపై నెట్టింట చర్చ మొదలైంది. తాజాగా ఈ ప్రచారంపై అల్లు అర్జున్ మేనేజర్ శరత్ చంద్ర నాయుడు స్పందించారు.“ప్రమోషన్స్‌లో మరీ హడావుడి చేయొద్దని, ‘అవతార్’ లాంటి గొప్ప చిత్రాలతో మన సినిమాను పోల్చడం వల్ల భవిష్యత్తులో నష్టం జరుగుతుందని ఓ అభిమాని సోషల్ మీడియా వేదికగా కోరారు. దీనికి బదులిచ్చిన శరత్.. “మీ సూచనకు ధన్యవాదాలు. ‘గ్లోబల్ ట్రయంఫ్’ అనే పదాన్ని ఓ ప్రత్యేక కారణంతోనే వాడాం. ఆ విషయం త్వరలోనే మీ అందరికీ తెలుస్తుంది. ఒక్క విషయం మాత్రం స్పష్టం చేస్తున్నాం.. ‘రాకా’ చిత్ర బృందం ఎప్పుడూ ఈ సినిమాను ఇతర గొప్ప సినిమాలతో పోల్చలేదు. కథపై మాకు పూర్తి నమ్మకం ఉంది. కంటెంటే మాట్లాడుతుంది” అని క్లారిటీ ఇచ్చారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ‘రాకా’.. మూడు విభిన్న కాలాల నేపథ్యంలో సాగుతుందని సమాచారం. ఇందులో కొత్త రకం ప్రాణులు, వింత క్రూర జంతువులు కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో బన్నీకి జోడీగా బాలీవుడ్ భామ దీపికా పదుకొణె నటిస్తున్నారు. అలాగే రష్మిక మందన్నా, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, ఐశ్వర్య లక్ష్మి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు.



### ‘ది ప్యారడైజ్’ స్పెషల్ ప్రీమియర్..
## తెలంగాణలో టికెట్ ధరల పెంపు

నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ ‘ది ప్యారడైజ్’. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా తెలంగాణలో టికెట్ ధరలను పెంచుకునేందుకు చిత్ర బృందానికి అనుమతి లభించింది. అంతేకాదు, సెప్టెంబరు 23న సాయంత్రం 6.30కు స్పెషల్ ప్రీమియర్ వేసేందుకు కూడా అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.స్పెషల్ ప్రీమియర్ ధరను రూ.500 (జీఎస్టీతో కలిపి)గా నిర్ణయించారు. సింగిల్ స్క్రీన్‌లో సెప్టెంబరు 24 నుంచి 27 వరకూ ప్రస్తుతం ఉన్న టికెట్ ధరకు అదనంగా రూ.48 (జీఎస్టీతో కలిపి); సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 3 వరకూ రూ.23 (జీఎస్టీతో కలిపి).. ఇక మల్టీప్లెక్స్‌లో వరుసగా అదే తేదీల్లో రూ.94, (జీఎస్టీతో కలిపి) రూ.45 (జీఎస్టీతో కలిపి) పెంచుకునేందుకు వెసులుబాటు ఇచ్చారు. రోజుకు ఐదు షోలను ప్రదర్శించేందుకు అనుమతి లభించింది. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీకి చిత్ర నిర్మాణ సంస్థ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినీమాస్ ఎల్ఎల్‌పీ రూ.కోటి అందజేసింది.

## ‘టైగర్ 3’ దర్శకుడితో సారా?

బాలనటిగా కెరీర్ ఆరంభించి.. ప్రస్తుతం అగ్ర తారల అవకాశాల్ని అందుకుంటూ కెరీర్‌లో మంచి జోష్ మీదుంది బాలీవుడ్ యువకథానాయిక సారా అర్జున్. ఈ మధ్యే ‘ధురంధర్’ చిత్రాల్లో తనదైన నటనతో ఆకట్టుకొని బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ తార.. ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ‘టైగర్ 3’ ఫేమ్ మనీశ్ శర్మతో ఓ చిత్రం కోసం సారా చేతులు కలిపినట్లు సమాచారం. “పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా దీన్ని తీర్చిదిద్దాలనుకుంటున్నారు దర్శకుడు. ఇందులో సారా సరసన ‘సప్నే వర్సెస్ ఎవ్రీవన్’ చిత్రంతో మంచి క్రేజ్ తెచ్చుకున్న అంబ్రీశ్ వర్మ కనిపించనున్నారు. ప్రస్తుతం చిత్రబృందం నాయికతో చర్చలు చేస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి” అని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.





### ఆ సమయంలో మానసికంగా చాలా ఇబ్బంది పడ్డా..
## నోరా ఫతేహి ఎమోషనల్ కామెంట్స్

బాలీవుడ్ హాట్ బ్యూటీ నోరా ఫతేహి తన కెరీర్ తొలినాళ్లలో పడ్డ కష్టాల గురించి తాజాగా ఒక పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. ఆమె గతంలో హిందీ బిగ్‌బాస్ సీజన్9లో వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై మాట్లాడుతూ.. మొదట రియాలిటీ షోలను తాను చాలా చిన్నచూపు చూసేదానినని, కానీ తర్వాత పరిస్థితుల కారణంగా తన నిర్ణయం మార్చుకోవాల్సి వచ్చిందని నోరా తెలిపారు. ఆ సమయంలో తాను వరుసగా కొన్ని పాటల్లో నటించినప్పటికీ, తనకు రావాల్సిన రెమ్యునరేషన్ అందలేదని ఆమె చెప్పారు. నిర్మాతలు ఏజెన్సీకి డబ్బులు చెల్లించి ఉండవచ్చు కానీ, తనకు మాత్రం పైసలు రాలేదని అన్నారు. డబ్బుల కోసం తాను ప్రొడ్యూసర్లతో గొడవ పడాల్సి వచ్చిందని, ఆ సమయంలో మానసికంగా చాలా ఇబ్బంది పడ్డానని తెలిపింది. సరిగ్గా అదే సమయంలో బిగ్‌బాస్ టీమ్ నుంచి తనకు ఆఫర్ వచ్చిందని చెప్పారు. మొదట తాను ఆ షో చేయడానికి ససేమిరా ఒప్పుకోలేదని, తమకు తన ప్లానింగ్ ఏమిటో అర్థం కావడం లేదని వాళ్లతో వాదించినట్లు ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే ఆ షో ఇస్తున్న భారీ మొత్తాన్ని చెప్పగానే తన ఆలోచన మారిపోయిందని నోరా చెప్పారు. డబ్బుల కోసమే తాను ఆ షోకి వెళ్లినట్లు ఆమె తెలిపారు. రియాలిటీ షోలు అంత చెడ్డవి కాదని, పైగా అవి మిమ్మల్ని క్షణాల్లో పాపులర్ చేస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. తాను వైల్డ్ కార్డ్ ద్వారా వెళ్లాను కాబట్టి ఎక్కువ రోజులు ఉండాల్సిన పనిలేదని భావించానని చెప్పారు. అంతేకాకుండా అదే ఛానెల్‌లో ప్రసారమయ్యే ‘ఝలక్ దిఖ్లా జా’ షో చేయాలని తాను బలంగా కోరుకున్నానని, అందుకే బిగ్‌బాస్‌కు వెళ్లేందుకు ఒక కండీషన్ పెట్టినట్లు వెల్లడించారు. బిగ్‌బాస్ చేస్తే తనకు ‘ఝలక్ దిఖ్లా జా’ అవకాశం ఇవ్వాలని ఛానెల్ వారిని కోరగా, వారు అంగీకరించడంతోనే తాను బిగ్‌బాస్‌లోకి అడుగుపెట్టినట్లు నోరా క్లారిటీ ఇచ్చారు.

## మరోసారి తల్లి దండ్రులైన దీపిక-రణ్‌వీర్



బాలీవుడ్ తారలు దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్ దంపతులు మరోసారి తల్లి దండ్రులయ్యారు. తాజాగా ఈ శుభవార్తని సామాజిక మాధ్యమాల వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ‘వెల్‌కమ్ బేబీ గర్ల్..’ అనే క్యాప్షన్‌తో తమ రెండో కుమార్తెకి స్వాగతం పలికారు. ఈ జంట 2018లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి తొలి సంతానంగా 2024లో కుమార్తె దువా పదుకొణె జన్మించిన విషయం తెలిసిందే. ఇప్పుడామె.. తన చిట్టి చెల్లెలికి తల్లిదండ్రులతో కలిసి స్వాగతం పలికింది. ఈ సందర్భంగా బాలీవుడ్ నటీనటులు దీపిక, రణ్‌వీర్ దంపతులకు నెట్టింట శుభాకాంక్షలు తెలిపారు.

## కత్రినాపై ట్రోలింగ్.. నెటిజన్లపై సల్మాన్ ఖాన్ ఫైర్

ప్రసవానంతరం బరువు పెరిగిన బాలీవుడ్ నటి కత్రినా కైఫ్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌ను స్టార్ హీరో సల్మాన్ ఖాన్ తీవ్రంగా ఖండించారు. ‘బిగ్‌బాస్20’లోని ఓ ఎపిసోడ్‌లో ఆయన ఈ విషయంపై స్పందిస్తూ.. ఇతరులను కించపరిచే ట్రోలర్స్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.“గర్భం దాల్చిన తర్వాత బరువు పెరగడం అనేది ఎవరికైనా చాలా సహజం. ఒక మహిళను బరువు గురించి ట్రోల్ చేయడం సరికాదు. కత్రినా ప్రస్తుతం తన కుటుంబంతో సమయం గడపాలనుకుంటోంది. ఆమె మళ్లీ షూటింగ్స్‌లో పాల్గొనే సమయానికి కచ్చితంగా మునుపటి ఆకృతిలోకి వస్తుంది. ఇలాంటి ట్రోల్స్‌ను ఆమె అస్సలు పట్టించుకోకూడదు” అని సల్మాన్ అసహనం వ్యక్తం చేశారు.“సోషల్ మీడియా ద్వారా నేడు చాలా మంది ఉపాధి పొందుతున్నారు. కానీ, కొందరు మాత్రం ఇతరులను కించపరుస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. వాళ్ల నిజమైన ముఖాలు, గుర్తింపును బయటపెట్టుకోలేరు కానీ.. ఎదుటివారి వయసు, బరువు, అందంపై విమర్శలు చేస్తారు. ఇతరుల వైఫల్యాలను చూసి ఆనందించేవారు చాలా మందే ఉన్నారు. నన్ను కూడా ముసలోడిని అయిపోయానని ట్రోల్ చేస్తుంటారు. అవును.. నాకు 60 ఏళ్లు. నేను ఎప్పటికీ ‘మైనే ప్యార్ కియా’ నాటి కుర్రాడిలాగే కనిపించలేను కదా? వయసు పెరగడం అనేది చాలా సాధారణ విషయం. కానీ, దాన్నేదో పెద్ద నేరంలా చూస్తూ విమర్శించడం సరికాదు” అని సల్మాన్ పేర్కొన్నారు. ఇదే ఎపిసోడ్‌కు సంబంధించిన మరో ప్రోమో అభిమానులను ఆందోళనకు గురిచేసింది. వేదికపై మాట్లాడుతున్న సల్మాన్.. అకస్మాత్తుగా ఛాతీ పట్టుకుని కుప్పకూలిపోయారు. అయితే, అదంతా కేవలం ఓ కంటెస్టెంట్‌కు బుద్ధి చెప్పేందుకు చేసిన ప్రాంక్ మాత్రమేనని సల్మాన్ సోషల్ మీడియా ద్వారా క్లారిటీ ఇచ్చారు. హౌస్‌లో ఉన్న ఓ కంటెస్టెంట్.. తనకు అనారోగ్యంగా ఉందని, ‘మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్’ ఉందని మిగతావారితో అబద్ధం చెప్పారు. ఆరోగ్యపరమైన విషయాలతో సరదాగా ఆడుకుంటే ఎదుటివారు ఎంతలా కంగారు పడతారో అతడికి ప్రాక్టికల్‌గా అర్థమయ్యేలా చెప్పడానికే సల్మాన్ ఇలా చేశారట. కాబట్టి అభిమానులు ఎవరూ ఆందోళన చెందొద్దని సల్మాన్ స్పష్టం చేశారు.







Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com